RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 47 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | ఆదివారం 31-5-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి TELANGANA VANI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## ముష్కిన్ చెరువు

# కబ్జా బట్టబయలు

- రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా
- ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా
- చెరువు అభివృద్ధిపేరిట జరిగిన కబ్జాలకు హైడ్రా చెక్
- రెండు నెలల నోటీసు తర్వాత రంగంలోకి దిగిన అధికారులు



**హైదరాబాద్** హైదరాబాద్ జలవనరుల పరిరక్షణే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా మరో భారీ ఆపరేషన్‌తో సంచలనం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాల్‌గూడ - నార్సింగి పరిధిలోని ముష్కిన్ చెరువు ఆక్రమణలపై శనివారం ఉక్కుపాదం మోపింది. సుమారు 5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడేందుకు హైడ్రా కమిషనర్ రంగంలోకి దిగి, చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. ముష్కిన్ చెరువు పరిరక్షణ పేరుతో జరిగిన ఒక భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా అధికారులు చాకచక్యంగా అడ్డుకున్నారు. ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద చెరువును అభివృద్ధి చేస్తామంటూ ముందుకు వచ్చి, అసలు కథ నడిపింది. చెరువు మధ్యలో ఏకంగా ఒక ఆనకట్ట వంటి కట్టడాన్ని నిర్మించి, సుమారు 34.21 ఎకరాల జలవనరును ఆక్రమించుకునేందుకు ప్రయత్నించింది. నిబంధనలను తుంగలో తొక్కి సాగుతున్న ఈ నిర్మాణాలను గుర్తించిన హైడ్రా, వాటిని పూర్తిగా తొలగించి చెరువుకు పూర్వవైభవం తెచ్చే పనిలో పడింది.

2లో..

## బాల్క సుమన్ అరెస్టు

- వివాదాస్పద వ్యాఖ్యల కేసులో చర్యలు




**హైదరాబాద్** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు సమయంలో తెలంగాణ భవన్ కేంద్రంగా హైడ్రామా సాగింది. తీవ్ర ఉద్రిక్తత మధ్య ఆయన్ని నాంపల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సింగరేణిని తగలబెట్టాలని, మిలిటెంట్ యాక్టివిటీ చేయాలని చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. దీంతో ఆయనపై పలు స్టేషన్స్‌లో కేసులు నమోదు అయ్యాయి. సింగరేణి బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు ఆయన అరెస్టుకు దారి తీశాయి. సింగరేణిని తగులబెట్టండి, మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. డబ్బులు కావాలంటే ఆఫీస్‌లను తగలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కామెంట్స్‌పై ఆనంద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 326(జి), 351(3), 353(1)(బి), ఆర్/డబ్ల్యూ 61(2)(ఏ), బిఎన్ఎస్4 పీడీపీపీఏ వంటి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మిలిటెంట్ వ్యాఖ్యలు చేసిన తర్వాత ఆయన అరెస్టు ఖాయమని ప్రచారం జరిగింది. దీంతో బాల్క సుమన్ గత మూడు రోజులుగా

2లో..

# బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్

- రైతు డిస్కం ఏర్పాటుచేస్తోన్న తెలంగాణ ప్రభుత్వం
- ఉచిత విద్యుత్ ఎత్తేస్తారంటూ బీఆర్ఎస్ ఆరోపణ - హరీష్ రావు విమర్శలపై స్పందించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్** రైతు డిస్కం ఏర్పాటు విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తోన్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టినా, ఉచిత విద్యుత్‌ను నిలిపివేసినా తాము ఎన్నికల్లో పోటీచేయబోమని ఒకవేళ మీటర్లు బిగించకుండా ఉచిత విద్యుత్ కొనసాగిస్తే పోటీ నుంచి బీఆర్ఎస్ తప్పుకుంటుందా? అని సవాల్ విసిరారు. దేశంలో తొలిసారి రైతు డిస్కం ఏర్పాటుచేశామని, 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ కోసమేనని తెలంగాణ సీఎం స్పష్టం చేశారు.అంతేకాదు, రైతు పండించే ప్రతి గింజను తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పునరుద్ఘాటించారు. కనీస మద్దతు ధరను నిర్ణయించిన కేంద్రం రైతు పండించిన పంటను కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి అని అన్నారు. 'రాష్ట్రం కొనుగోలుచేసిన ప్రతి గింజను కేంద్రం కొనాలని, లేకుంటే బీజేపీ నేతల ఇళ్ల వద్ద నిరసనలు చేపడతాం' అని హెచ్చరించారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. హరీష్ రావు చెప్పిన ధరకే బియ్యం అమ్ముతామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ కొనసాగిస్తామని రేవంత్ తెలిపారు."రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం విద్యుత్ వినియోగాన్ని దీనికి అనుసంధానం చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుంది ఏడాదికి మేము రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే రూ.95 వేల కోట్లు రుణాలు తీరుస్తున్నాం కానీ, మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు మాట్లాడటం లేదు రూ.54 వేల కోట్లు రుణం తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్బీఎం

2లో..



# బెంగాల్‌లో ఆగని హింస

- దీదీ మేనల్లుడిపై రాళ్లు, చెప్పులు, కోడిగుడ్లతో దాడి



**కోల్కతా** పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్‌లో శనివారం మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఎన్నికల అనంతర హింసాకాండ బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన సందర్భంగా ఆయనపై గుడ్లు, రాళ్లు విసిరారు. ఇదే సమయంలో బీజేపీ కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా 'దొంగ దొంగ' అని నినాదాలు చేశారు. ఈ దాడి నుంచి అభిషేక్‌కు కాపాడేందుకు భద్రత సిబ్బంది తమ హెల్మెట్ ఇచ్చి రక్షణగా నిలిచారు. బీజేపీ కార్యకర్తలే దాడి చేశారని టీఎంసీ ఆరోపించింది. అక్కడ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో భద్రతా సిబ్బంది ఆయనను చుట్టుముట్టి రక్షణగా నిలుస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ఈ ఘటన అనంతరం అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ

2లో..

ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, సోషల్ యాక్టివిస్ట్

డా. నీలం సంపత్

'సోషల్ పర్ స్పెక్టివ్స్'

పుస్తకావిష్కరణ సభ






వేదిక : బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్

తేది, సమయం : మే 31, 2026, ఆదివారం, ఉదయం : 10 గం.లకు

ఆవిష్కర్త

ప్రొ. కోదండ రామ్
శాసన మండలి సభ్యులు, తెలంగాణ

ముఖ్య అతిథులు

డా.కె.రామచంద్రమూర్తి
సీనియర్ ఎడిటర్

కె. శ్రీనివాస్ రెడ్డి
చైర్మన్, మీడియా అకాడమీ, తెలంగాణ

అల్లం నారాయణ
తొలి చైర్మన్, తెలంగాణ మీడియా అకాడమీ

విశిష్ట అతిథులు

అర్విణి రాజేంద్రబాబు
ఫైనాన్స్ సెక్రటరీ,AIFRUCTO

కోమటిరెడ్డి మోహన్ రెడ్డి
గౌరవ అధ్యక్షులు,
తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్

ఎం.వి. గోనా రెడ్డి
సిఈఓ, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్

గౌరవ అతిథులు

ఎ.పుల్లయ్య
మాజీ జాతీయ కార్యదర్శి,AIFRUCTO

డా.ఏనుగు నరసింహారెడ్డి, IAS
డైరెక్టర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

ప్రొ.కూరపాటి వెంకట నారాయణ
చైర్మన్, తెలుగు అకాడెమీ, తెలంగాణ

ప్రత్యేక అతిథులు

సారంపల్లి మల్లారెడ్డి
ఉపాధ్యక్షులు, అఖిల భారత కిసాన్ సభ

ఎ.వి.వి ప్రసాద్
అసోసియేట్ ఎడిటర్, వార్త

సభాధ్యక్షత

డా. నర్రా ప్రవీణ్ రెడ్డి
రచయిత, లెక్చరర్

స్వాగతం

కోట సతీష్ కుమార్
ఏఓ, ఎస్.ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడెమీ

నిర్వహణ

తెలంగాణ తెలుగు పరిశోధక మండలి

అందరికీ ఇదే మా ఆహ్వానం

## సీఎల్పీ నేతగా డీకే శివకుమార్

# ఎన్నిక ఏకగ్రీవం

- జూన్ 3న కర్ణాటక సీఎంగా ప్రమాణం



**బెంగుళూరు** ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనే డీకే శివకుమార్ ఆశ ఎట్టకేలకు నెరవేరబోతోంది. శనివారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్షం సమావేశంలో ఆయనను ఎమ్మెల్యేలు తమ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్ణాటక అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే పేరును ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రతిపాదించారు. ఆయనకు ఎమ్మెల్యేలంతా మద్దతు తెలపడంతో డీకే ఎన్నిక ఏకగ్రీవమైంది. కేంద్ర పరిశీలకులుగా వచ్చిన కర్ణాటక వ్యవహారాల ఇంఛార్జ్ రణ్‌దీప్ సూర్జేవాలా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమక్షంలో సమక్షంలో సీఎల్పీ నేత ఎన్నిక జరిగింది. అనంతరం డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పరిశీలకులు ప్రకటించారు.ఎటువంటి నాటకీయ పరిణామాలకు చోటులేకుండా కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. కాంగ్రెస్‌కు చెందిన 138 మంది ఎమ్మెల్యేలు హాజరై డీకేను ఎన్నుకున్నారు. అయితే, జూన్ 3న శివకుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఇక, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా రెండేళ్లే ఉండటంతో డీకే నాయకత్వంలో ఏర్పడే కొత్త ప్రభుత్వానికి క్యాబినెట్ కూర్పుపై ఇబ్బంది ఎదురవకూడదనేది కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచన. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేసిన రెండు మూడ్రోజుల్లోనే పాలనను పరుగులు పెట్టించాలన్నది హైకమాండ్ లక్ష్యం.ఇందు కోసమే ఢిల్లీలో గత రెండు రోజుల నుంచి మంత్రివర్గ కూర్పుపై ముమ్మర కసరత్తు చేశారు. క్యాబినెట్ కూర్పుపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని డీకే చెప్పినా వడబోత పూర్తయినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రితో పాటు మంత్రివర్గమంతా ప్రమాణస్వీకారం చేస్తుందా? లేదంటే సాంకేతికంగా ఐదారుగురు బాధ్యతలు తీసుకుంటారా? అన్నది మరికొద్ది గంటల్లోనే

2లో..

## రేవంత్ రెడ్డి

# ఒక రెన్యూవల్ సీఎం

- తెలంగాణ తెచ్చిన మగోడు, మొనగాడు కేసీఆర్



**హైదరాబాద్** కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. ఇందిరాపార్కు వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. రేవంత్ రెడ్డి ఒక రెన్యూవల్ సీఎం మాత్రమేనని చెప్పుకొచ్చారు.2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని 50 వేల మందిని కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఎన్నికల ముందు చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం (మొత్తం 72 శాతం) రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. కానీ అధికారం లోకి వచ్చాక 72 శాతం కాదు గదా, 72 పైసలు కూడా ఈ వర్గాలకు ఇవ్వకుండా అడ్డగోలు జీవోలను తెచ్చారని మండిపడ్డారు. చివరికి గురుకుల పాఠశాలల్లో స్థానిక చిన్న కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, చికెన్, పాలు, బ్రెడ్ వంటి వాటిని కూడా దక్కకుండా చేస్తూ 'జీవో నెం.17' తీసుకువచ్చి, ఆ టెండర్లను పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన ఈ జీవో 17 రద్దయ్యే వరకు, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కే వరకు పోరాటం ఆపేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇవాళ రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని, రేవంత్ రెడ్డి బామ్మర్దికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకే అన్ని కాంట్రాక్టులు ఇస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సొంత నియోజకవర్గం కొడంగల్ - నారాయణ పేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ.4 వేల కోట్ల కాంట్రాక్టును తన అనుయాయులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కేవలం వాళ్ల బంధువులకే కాకుండా, బీజేపీ ఎంపీ

2లో..

# శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ధ్యేయం

## - వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ సీవీ ఆనంద్ దిశానిర్దేశం

**కరీంనగర్, మే 30 (తెలంగాణ వాణి ప్రతినిధి)** రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడానికి, ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించడానికి పోలీస్ శాఖ సరికొత్త కార్యాచరణతో ముందుకు సాగుతోంది. శనివారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్ని కమీషనరేట్లు, విభాగాలు, జిల్లాల ఎస్పై మరియు అంతకంటే పైస్థాయి అధికారులతో దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్ నుండి సీపీ గౌష్ ఆలం కమీషనరేట్ అధికారులతో కలిసి ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, సాంప్రదాయ నేరాల కంటే ప్రస్తుతం సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా పెను సవాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో దొంగతనాలు, దోపిడీల ద్వారా రూ. 500 కోట్లు నష్టం వాటిల్లితే, ఒక్క సైబర్ నేరాల ద్వారానే ఏకంగా రూ. 15 వేల కోట్లు కొల్లగొట్టబడ్డాయని, దీనిపై ప్రత్యేక దృష్టి








సారించాలని ఆదేశించారు. అలాగే మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతీ విద్యాసంస్థలో తప్పనిసరిగా 'యాంటీ డ్రగ్ సేఫ్టీ కమిటీలు' ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ దుర్వినియోగంపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ?రాష్ట్ర వ్యాప్తంగా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ట్రాఫిక్ మేనేజ్మెంట్, రోడ్ సేఫ్టీ బ్యూరో'తో పాటు, ఆహార కల్తీ,డ్రగ్ కంట్రోల్ కోసం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్' రాష్ట్రస్థాయి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ ప్రకటించారు. మహిళలు, పిల్లల రక్షణ,మానవ అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ డీజీపీ కార్యాలయంలో టెక్ టీం ఆఫీస్ ఏర్పాటు చేస్తున్నామని, సీసీటీఎన్ఎస్ లో కేసుల డేటాను పూర్తిగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. దీనిపై టెక్నికల్ సర్వీసెస్ డీజీపీ వి.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.రానున్న రోజుల్లో డేటా నమోదు అత్యంత కీలకమని, ఇతర ప్రాంతాల నుండి వచ్చే 'జీరో ఎఫ్ ఐ ఆర్'లను వెంటనే నమోదు చేయాలన్నారు. అడిషనల్ డీజీపీ (శాంతిభద్రతలు) మహేష్ భగవత్ మాటా ్లడుతూ నేరగాళ్లను పట్టుకునేందుకు ఫింగర్ ప్రింట్ స్కానర్లను విరివిగా ఉపయోగించాలని సూచించారు. సీఐడీ డీజీపీ చారు సిన్హా మాట్లాడుతూ నెలవారీ నేర సమీక్షల డేటాను క్రోడీకరించి డీజీపీకి సమర్పిస్తామన్నారు. ఐజీపీ (పర్సనల్) మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో తీసుకురాబోయే నూతన హెల్త్ స్కీమ్ కొరకు సిబ్బంది వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని కోరారు. ?పోలీసింగ్ విధానంలో మార్పులు రావాలని, బాధితుల పట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అవలంబిస్తూనే, నేరస్థులు, సంఘవిద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి, క్రమశిక్షణతో,అంతర్గత సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యూనిట్ అధికారులు నాయకుడిగా ముందుండి సిబ్బందిని నడిపించాలన్నారు.ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ప్రతి పనిదినాల్లో మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు కమీషనరేట్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండి బాధితులు,కిందిస్థాయి సిబ్బంది నుండి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడం ద్వారా నేరాలను తగ్గించవచ్చన్నారు. 'నేను సైతం'కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.సోషల్ మీడియాలో వస్తున్న అంశాలపై అప్రమత్తంగా ఉంటూనే పోలీసులు అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భూవివాదాల విషయంలో ఇరువర్గాల వాదనలు విని, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.

# ముష్కిన్ చెరువు కబ్జా బట్టబయలు

హెచ్ఎండిఏ లెక్కల ప్రకారం ముష్కిన్ చెరువు 52.20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది 59.11 ఎకరాల వరకు ఉండగా, ఇందులో 20.23 ఎకరాలు ప్రభుత్వ భూమిగా ఉంది. ఈ భూమిపై కన్నేసిన రియల్టర్లు, పేదల పేరుతో అక్కడ గుడిసెలు వేయించి కబ్జాకు తెరలేపారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి విలువ అక్షరాలా 5,500 కోట్ల రూపాయలు. ఇంతటి భారీ విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడేందుకు హైడ్రా శనివారం నుంచి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసే పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించింది.చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో గుడిసెలు వేయించి, ఆ భూమిని ఆక్రమించుకోవాలని చూసిన రియల్టర్ల వ్యూహానికి హైడ్రా చెక్ పెట్టింది. అక్కడ నివసిస్తున్న వారికి గత రెండు నెలల క్రితమే నోటీసులు ఇచ్చి, ఖాళీ చేసేందుకు సమయం ఇచ్చింది. హైడ్రా హెచ్చరికలతో గుడిసెల్లోని వారు స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్లిపోవడంతో, అధికారులు శనివారం ఎలాంటి ఆటంకం లేకుండా క్లీన్ స్వీప్ చేశారు. చెరువు మధ్యలో పోసిన మట్టి కట్టలను, అక్రమంగా నిర్మించిన ఎంబ్యాంక్‌మెంట్‌ను జేసీబీలతో తొలగించి నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చేశారు.చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన సంస్థ పర్యావరణ నిబంధనలను ఘోరంగా ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. చెరువు విస్తీర్ణాన్ని తగ్గించి, మిగిలిన భూమిని కమర్షియల్ ప్రయోజనాల కోసం వాడుకోవాలనే కుట్ర ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని హైడ్రా వర్గాలు తెలిపాయి. ఎఫ్‌టిఎల్ సరిహద్దులను నిర్ణయించి, ఏ ఒక్క అంగుళం భూమి కూడా అక్రమార్కుల పాలు కాకుండా పక్కాగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ భూమితో పాటు ఎక్సల్ పట్టా భూముల్లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై కూడా హైడ్రా దృష్టి సారించింది.ముష్కిన్ చెరువు రక్షణ కోసం హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ రియల్ ఎస్టేట్ మాఫియాకు గట్టి హెచ్చరికగా మారింది. చెరువుల పునరుద్ధరణ పేరుతో భూములను మింగేయాలని చూస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఈ ఘటన నిరూపించింది. శనివారం రోజంతా సాగిన ఈ ఆపరేషన్‌తో గండిపేట పరిసర ప్రాంతాల్లో భూబకాసురుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నగరంలోని మరిన్ని జలవనరులను కాపాడేందుకు హైడ్రా తన తదుపరి లక్ష్యాలను సిద్ధం చేసుకుంటోంది.

# బాల్క సుమన్ అరెస్టు

తెలంగాణ భవన్‌నే తన ఆవాసంగా మార్చుకున్నారు. ఆయన బయటకు రాగానే అరెస్టు చేయాలని పోలీసులు వ్యూహం రచించారు. భవన్ వెలుపల భారీగా పోలీసులు మోహరించారు. లోపల బీఆర్ఎస్ కార్యకర్తలు, లాయర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీస్ గో బ్యాక్ అంటూ కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని బీఆర్ఎస్ లీగర్ సెల్ ప్రశ్నించగా, నాన్‌బెయిల్‌బుల్ కేసులు కాబట్టి నోటీసులు అవసరం లేదని పోలీసులు చెబుతున్నారు.అరెస్టుకు కొద్ది నిమిషాల ముందు బాల్క సుమన్ మీడియా ముందు తన గళాన్ని గట్టిగానే వినిపించారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను, సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలను ప్రశ్నిస్తున్నందుకు తనపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 250కిపైగా కేసులు ఉన్నాయని, జైలుకు వెళ్లడం తనకు కొత్త కాదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి కుట్రపూరితంగా తనను జైలుకు పంపి పైశాచికానందం పొందాలని చూస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో వందల కోట్ల స్కాములు జరుగుతున్నాయని, వారసత్వ ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని ఆయన దుయ్యబట్టారు.పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అత్యంత కఠినమైనవి. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి ప్రేరేపించడం వంటి సెక్షన్ల వల్ల పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందని సమాచారం. బీఆర్ఎస్ లాయర్లు మాత్రం ఇవన్నీ అక్రమ కేసులని, బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

# బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్

పరిధి దాటి రుణాలు చేయడానికి అనుమతి లేదు" అని పేర్కొన్నారు."బీఆర్ఎస్‌లోనే ఉంటానని కేసీఆర్ మీద ఒట్టేసి హరీశ్‌రావు చెప్పాలి. గతంలో వైఎస్సార్ దగ్గరికి హరీష్ వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారు? ఎవరిని కలుస్తున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన ఢిల్లీకి ఎందుకు వెళ్లారు? బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో ఎటువంటి అనుమానమే లేదు" అని అన్నారు. సీబీఎస్ఈలో ప్రశ్నాపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ అని ఆరోపించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీలపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ రెండు పార్టీలు అబద్దాల పునాదులపై రాజకీయాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. 2034 వరకు తాను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని, ప్రజలకు మేలు చేయాలనేది తన ఉద్దేశమని అన్నారు. 2029 ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ నాయకత్వంలో మళ్లీ కాంగ్రెస్ గెలుస్తుందని, తమది విజయవంతమైన జోడీ అని జోస్యం చెప్పారు. అంతరాష్ట్ర జల వివాదాలను చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారని, కానీ తుమ్మిడి హట్టిపై మాట్లాడేందుకు మహారాష్ట్ర సీఎం సమయం ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# బెంగాల్‌లో ఆగని హింస

ఈ దాడిని బీజేపీయే ప్రోత్సహించిందని ఆరోపించారు. 'ఇదంతా బీజేపీయే ప్రోత్సహించింది. వాళ్లు ఏం చేశారో చూడండి. ఇదేనా వాళ్ల ప్రజాస్వామ్యానికి ఉదాహరణ. నెల కూడా కాలేదు, పోలీసులు ఎక్కడా కనిపించడం లేదు" అని ఆయన అన్నారు. దాడి చేసినవారు తనను చంపడానికే వచ్చారని ఆరోపించిన బెనర్జీ.. ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డయిందని పేర్కొన్నారు. "వారు నన్ను చంపాలనుకున్నారు. ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డ్ అయింది. మేము ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తప్పకుండా తీసుకువస్తాం, గవర్నర్‌కు కూడా తెలియజేస్తాం నేను తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తాను" అని ఆయన అన్నారు.తాను త్రుటిలో తీవ్ర గాయాల నుంచి తప్పించుకున్నానని చెప్పారు. "నా తలకు గాయంకాకుండా తప్పించుకున్నారు అదృష్టవశాత్తు, నేను హెల్మెట్ ధరించాను వారు నా బట్టలు చించి, నా కళ్లజోడు పగలగొట్టారు" అని తెలిపారు. అంతేకాదు, "ఘటనా స్థలంలో పోలీసుల ఉనికి లేదు. వారు మమ్మల్ని చంపాలనుకుంటున్నారు. చంపనివ్వండి నేను చావనైనా చస్తాను కానీ ఇక్కడ నుంచి కదలను" అని ఆయన అన్నారు. తగిన భద్రతా ఏర్పాట్లు చేసే వరకు తాను వెళ్లబోనని తేల్చిచెప్పారు. ఉద్రిక్తతల నడుమ పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు ఘటనా స్థలానికి చేరుకుని బెనర్జీని రక్షించారు.కలవడానికి వచ్చిన బాధిత కుటుంబాన్ని ఉద్దేశించి బెనర్జీ మాట్లాడుతూ "ఈ పరిస్థితుల్లో వృద్ధులైన సంజు తల్లిదండ్రులను నేను వదిలిపెట్టి వెళ్లను. పోలీసులను సంప్రదించమని నేను మరోసారి మా ప్రతినిధులను కోరతాను" అని అన్నారు. తమ పర్యటన గురించి అధికారులకు తమ పార్టీ ముందుగానే తెలియజేసింది కానీ స్పందించలేదని చెప్పారు. ఈ ఘటనపై టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ స్పందిస్తూ అభిషేక్ బెనర్జీ ప్రాణాలకు ప్రమాదం ఉందని, పోలీసులు ఎక్కడున్నారని ఆయన ప్రశ్నించారు.

# రేవంత్ రెడ్డి ఒక రెన్యూవల్ సీఎం

సీఎం రమేష్‌కు రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో రూ.4 అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు మరియు చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్‌కు ఉందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో గద్దెనెక్కారని, ఆయన ఒక రెగ్యులర్ సీఎం కాదని, కేవలం 'రెన్యూవల్ సీఎం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్‌కు నెలనెలా కప్పం (డబ్బులు) పంపి తన కుర్చీని కాపాడుకుంటున్నారని, ఢిల్లీకి బ్యాగులు మోసుకుంటూ పోయినన్ని రోజులు మాత్రమే ఆయన ఉద్యోగం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణా బడుగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఢిల్లీ హైకమాండ్ మౌనంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ఈ ద్రోహానికి రేవంత్ రెడ్డితో పాటు రాహుల్ గాంధీని, మల్లికార్జున ఖర్గేని కూడా నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ గారు 'సంపద సృష్టించాలి-పేదలకు పంచాలి' అనే దృక్పథంతో పనిచేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నాడు చిన్న చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుని గౌరవంగా నిలబెట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ అప్పులు చేసి 1000కి పైగా గురుకులాలు కట్టించి, 6.50 లక్షల మంది బడుగు విద్యార్థులకు ఒక్కొక్కరిపై రూ.1.20 లక్షల నుండి రూ.1.25 లక్షల వరకు ఖర్చు పెట్టి కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, బూట్లు, బట్టలు, నాణ్యమైన భోజనం అందించారని పేర్కొన్నారు. అప్పులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చారని, 24 గంటల కరెంట్, కేసీఆర్ కిట్, 15 లక్షల మంది ఆడబిడ్డలకు మేనమామ కట్నంగా కల్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయం అందించారని తెలిపారు. రైతులకు రూ.72 వేల కోట్ల రైతుబంధు సాయాన్ని నేరుగా ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. ముఖం బాగాలేక అద్దం పగులగొట్టుకున్న చందంగా తాము చేతగాక కేసీఆర్ అప్పులు చేశాడని రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. హద్దుమీరి మాట్లాడితే ఊరుకునేది లేదని, "తెలంగాణ తెచ్చిన మగోడు, మొనగాడు కేసీఆర్" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో మక్కలు, వడ్లు కొనుగోలు కాక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇవాళ ఏ ఒక్క ఊరికైనా కాంగ్రెస్ వాళ్లు వెళ్లే ధైర్యం ఉందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఎలక్షన్లు ఎప్పుడు వస్తాయా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాతపెట్టి, బొంద పెట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగితే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు వదిలిపెట్టకుండా ఎట్లా పోరాడారో, బడుగుల సమస్యలపై కూడా అలాగే పోరాడతామన్నారు. బడుగు వర్గాల సమస్యలపై అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఒకవేళ వాళ్ళు వినకపోతే భవిష్యత్తులో జంతర్ మంతర్ లేదా ఢిల్లీ వేదికగానైనా పోరాడుతామన్నారు.

# భద్రతా సూత్రాలు పాటించండి..

## - ప్రమాదాలను నివారించండి

**ప్రకాశం** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈ-చలాన్లు విధిస్తూ రోడ్డు భద్రతపై ప్రకాశం జిల్లా, మార్కాపురం జిల్లా పోలీసులు అవగాహనా కల్పిస్తున్నారు., ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రకాశం జిల్లా పోలీసులు మరియు మార్కాపురం జిల్లా పోలీసులు ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తున్న వాహనదారులను గుర్తించి వారికి ఈ-చలాన్లు విధించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు.హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్‌బెల్ట్ ధరించకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అతివేగంగా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలు తీవ్రమైన రోడ్డు ప్రమాదాలకు దారితీస్తాయని పోలీసులు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు.ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, తన భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా కాపాడేలా సహకరించాలని ప్రకాశం జిల్లా మరియు మార్కాపురం జిల్లా పోలీసులు కోరారు.

# నిమ్స్‌లో ఫైర్ మాక్ డ్రిల్

ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం (చినీతీశ్రీట ఇఎవతీణవనిఇఎ ఓవటతిఇతినివ ఆజీఎ) సందర్భంగా నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ట్రామా బ్లాక్‌లో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది.హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం మరియు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో, హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులైన జిల్లా ఫైర్ ఆఫీసర్ టి. వెంకట్, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వి. భానుప్రసాద్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.డి. షౌకత్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. సాయి రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించబడింది.అగ్నిప్రమాదం సంభవించిన సందర్భంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది, భద్రతా సిబ్బంది ఎలా స్పందించాలి, రోగులను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించడం జరిగిందని, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డమ్మీ పేషెంట్ల సహాయంతో డ్రిల్ నిర్వహించినట్లు నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు.ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం హెచ్. ఓ. డి డా.సునీల్ , ట్రామా బ్లాక్‌లోని వివిధ విభాగాల సిబ్బంది, నర్సింగ్ అధికారులు, టెక్నీషియన్లు, శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది ఈ మాక్ డ్రిల్ లో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మహిళను వేధించిన

# యువకులకు షాక్

### - అబిడ్స్ పోలీసుల స్పీడ్ యాక్షన్‌తో 48 గంటల్లోనే జైలు శిక్ష

**హైదరాబాద్** నిజాం కాలేజ్ దగ్గర డ్రంకెన్ కండిషన్‌లో మహిళను వేధించిన ఐదుగురు అరెస్ట్‌కోర్టు ఒక్కొక్కరికి 7 రోజుల జైలు శిక్ష విధించింది

.మహిళల భద్రతపై కఠినంగా వ్యవహరిస్తామన్న హైదరాబాద్ పోలీసులు శిక్ష పడిన

నిందితుల వివరాలు:
అందరూ కేటరింగ్ కార్మికులు, నేపాల్ దేశస్థులు, ప్రస్తుతం నివాసం: కింగ్ కోఠి, హైదరాబాద్,
సునీల్,ఉమేష్,లక్ష్మణ్,పురుషోత్త రామ్‌మహిళను వేధించిన కేసులో ఈ ఐదుగురికి కోర్టు 7 రోజుల జైలు శిక్ష విధించింది.



# సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నిక ఏకగ్రీవం

తేలిపోనుంది. మంత్రివర్గంలో ఇప్పటికే సిద్ధరామయ్య తన కుమారుడు యతీంద్రకు బెర్త్‌ను ఖాయం చేసుకోగా ఆయన క్యాబినెట్‌లు మంత్రులంతా మరోసారి చోటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.ఇదిలా ఉండగా, సీఎల్పీ సమావేశానికి బయలుదేరి వెళ్తుండగా డీకే శివకుమార్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియా ముఖ్యమంత్రిగా జూన్ 3న ప్రమాణస్వీకారం చేయనున్నారా? అడిగితే 'థర్డ్ థర్డ్' అంటూ డీకే బదులిచ్చారు.

# పెళ్లికి ముందు"ట్రాఫిక్ క్యారెక్టర్" సర్టిఫికేట్:

## కూతురు భవిష్యత్తు కోసం తండ్రి వినూత్న ఆలోచన

**కాకినాడ** పెళ్లి అంటే కేవలం ఆస్తులు, ఉద్యోగాలు, కుటుంబ నేపథ్యం చూసే కాలం మాత్రమే కాదు,వ్యక్తిత్వం, బాధ్యత, సమాజం పట్ల ప్రవర్తన కూడా ముఖ్యమని కాకినాడలో జరిగిన ఓ ఘటన మరోసారి గుర్తు చేసింది.తన కూతురికి కాబోయే అల్లుడు నిజంగా బాధ్యతాయుతమైన వ్యక్తేనా,రోడ్డు నిబంధనలు పాటిస్తాడా,మద్యం సేవించి వాహనం నడిపే అలవాటు ఉందా? అనే విషయాలు తెలుసుకోవాలని ఓ తండ్రి వినూత్నంగా ఆలోచించారు. యువకుడి ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్, కారు-బైక్ నంబర్లతో ట్రాఫిక్ పోలీసులను సంప్రదించి పూర్తి సమాచారం తీసుకున్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలపై పరిశీలించిన అధికారులు..అతడిపై ఎలాంటి కేసులు లేదా పెండింగ్ చలానాలు లేవని తెలిపారు.ఈ సందర్భంగా ఆ తండ్రి తీసుకున్న జాగ్రత్తను ట్రాఫిక్ సీఐ ప్రత్యేకంగా అభినందించారు.సమాజానికి ఒక సందేశం:ఇప్పటి యువతలో రోడ్డు భద్రతపై అవగాహన చాలా అవసరం. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం కేవలం జరిమానాలు తప్పించుకోవడానికే కాదు, కుటుంబ భద్రత, ప్రాణాల రక్షణ కోసం కూడా ఎంతో ముఖ్యం. పెళ్లి సంబంధాల్లో వ్యక్తి ప్రవర్తన, బాధ్యతాయుత జీవనశైలి కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందనే చర్చకు ఈ ఘటన దారి తీసింది.

## కంటైనర్ను ఢీకొట్టిన

# డీసీఎం వ్యాన్

### - డీసీఎం డ్రైవర్ కు తీవ్ర గాయాలు

**పిడుగురాళ్ల** పిడుగురాళ్ల పట్టణంలోని పిల్లుట్ల రోడ్ ఎక్స్ జంక్షన్ వద్ద డీసీఎం వ్యాన్ కంటైనర్ ను వెనక నుండి ఢీకొనడంతో డీసీఎం డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు.అతను బయటకు రాలేక రక్షించమని ఆర్తనాదాలు చేశాడు. అక్కడే రోడ్ పై ఉన్న తోటి లారీ డ్రైవర్లు, స్థానిక ప్రజలు, ప్రయాణికులు అందరూ కలిసి మానవత్వం చాటారు. సుమారు ఇరవై నిమిషాలు కష్టపడి మరొక లారీ సాయంతో డీసీఎం ముందు భాగానికి తాడు కట్టి లాగి అతన్ని బయటకు తీశారు. దీంతో డీసీఎం వ్యాన్ డ్రైవర్ కాలు పూర్తిగా తెగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రు లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

# గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**కడప** జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఎలాంటి అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని శనివారం కడప ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కడప జిల్లా వ్యాప్తంగా చదువు అనే పేరుతో గుర్తింపు లేని విద్యాసంస్థలు నడుపుతున్న యాజమాన్యాలు చాలా ఉన్నాయి.

అలాగే ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా చదువుతో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని వారన్నారు. జిల్లావ్యాప్తంగా పుట్టగొడుగులు లాగా ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు మరియు కళాశాలలు, కోచింగ్ సెంటర్లు ముందస్తు అడ్మిషన్ల పేరుతో వేల,లక్షలు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వస్తున్నాయని కేవలం అధికారులను మభ్యపెట్టే విధంగా యాజమాన్యాలు చేస్తున్నాయని వారు అన్నారు. ఇప్పటికైనా గుర్తింపు లేని విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని లేని పక్షంలో రాబోవు రోజుల్లో ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాటిని అడ్డుకొని రాజీలేని పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు నిత్య తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యం: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**- పథకాల అమలుపై క్షేత్రస్థాయి పరిశీలన - వరి కొనుగోలు కేంద్రాలు, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల తనిఖీ**







**అచ్చంపేట మే 30 (తెలంగాణ వాణి ప్రతినిధి)** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండల పరిధి మామిళ్లపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. మామిళ్లపల్లి చెరువు కట్టపై కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు. పనుల నాణ్యత, కార్మికుల హాజరు, వేతనాల చెల్లింపుల వివరాలు తెలుసుకుని పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి అర్హులకు అందించాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ ఉండొద్దని స్పష్టం చేశారు.

### జనాభా గణన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

కుటుంబాల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. జూన్ 1 నాటికి జిల్లాలో తొలి విడత జనగణన పూర్తి చేయాలని ఆదేశించారు. మామిళ్లపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు, తూకం, చెల్లింపుల ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు, నిల్వ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. రైతులు తమ పంటకు గిట్టుబాటు ధర పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

అంతకుముందు మామిళ్లపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాకు దూరంగా, పుస్తకాలకు దగ్గరగా ఉండాలి

**- సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలను షేర్ చేయవద్దు - కలెక్టర్ గరిమ అగ్రవాల్**







**రాజన్న సిరిసిల్ల,మే 30 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)** నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ, పుస్తకాలతో స్నేహం చేయడమే లక్ష్య సాధనకు ఏకైక మార్గమని, సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలను షేర్ చేయవద్దని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల కింద స్నేహ సంఘాల సభ్యుల ద్వారా మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే హాజరయ్యారు. ముందుగా జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. ఈ సందర్భంగా స్నేహ సంఘాల విద్యార్థులు అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీగా ఏర్పడి స్పీకర్ సమక్షంలో పలు అంశాలపై చర్చించారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలికల హక్కులు, విద్య, వివిధ సామాజిక అంశాలపై సుదీర్ఘ చర్చ చేశారు. అందరికీ ఆయా అంశాలపై అవగాహన వచ్చేలా చక్కగా వివరించారు. అమ్మకు అక్షరమాల కింద చదువు నేర్చుకున్న వారిని సన్మానించారు. మాక్ పార్లమెంట్ లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి నగదు, షీల్డ్ అందించి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూన్ 12 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో పది అంశాల ప్రాతిపదికన కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు తాము ఏ నేపథ్యం నుంచి వచ్చామనే దానితో సంబంధం లేకుండా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. నేడు మహిళలు కలెక్టర్లు, ఎస్పీలు, ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని అన్నారు.విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బెల్లం, ఖర్జూర, కోడిగుడ్లు, ఆకుకూరలు వంటి పోషకాహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు అందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నామని, విద్యార్థులు చదువు మధ్యలో ఆపకుండా ఉన్నత విద్యాభ్యాసం చేయాలని పిలుపునిచ్చారు. స్నేహ సంఘాల విద్యార్థులు తమకు ఎదురయ్యే ఆర్థిక, ఆరోగ్య సమస్యలపై చర్చించుకోవాలని, ముఖ్యంగా బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఆర్థిక నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ మహిళలు, బాలికలు, యువతులు తమ భద్రత కోసం 'షీ టీమ్స్' సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు . పాఠశాలలు, కళాశాలలు లేదా పని చేసే ప్రదేశాల్లో ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే 'షీ టీమ్' నంబర్ 8712656425 కు సంప్రదించాలని సూచించారు. భరోసా కేంద్రం ద్వారా బాధితులకు లీగల్ సాయం, వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్ అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సైబర్ నేరాల బారిన పడకుండా సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్ మోడ్ లో కాకుండా, ప్రైవేట్ గా ఉంచుకోవాలని సూచించారు.ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి రజిత, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యం కావాలి

**- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**





**పాల్వంచ, మే 30 (తెలంగాణ వాణి)**భారత దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యాకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలనీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధిలోని 38, 39,41,44 డివిజన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో కొత్వాల మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతలు ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నదని, కాంగ్రెస్ కార్యాకర్తలు, ప్రజలు రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నారని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, సీరపు సుగుణ, నూకల సరితా, మాలంపాటి భవిత, దున్నపోతుల మణి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, సొసైటీ డైరెక్టర్ కనగాల నారాయణ, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు నూకల రంగారావు, నరహరి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎస్ వి ఆర్ కె ఆచార్యులు, చింతా నాగరాజు, మిరియాల కమలాకర్, గుండు రవి, మిరియాల ధనలక్ష్మి, కొత్తపల్లి సోమయ్య, కటుకూరి శేఖర్, బత్తుల వెంకటేశ్వరరావు, ఆర్గిఫ్ అహ్మద్, వెలదాండి దుర్గాప్రసాద్, జయరాజు, బండి అంజయ్య, కట్టా భద్రయ్య, నికోలస్, ఆకుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందుతున్న సింగరేణి అధికారులకు ఘన వీడ్కోలు




కొత్తగూడెం సింగరేణి, మే 30 (తెలంగాణ వాణి) కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో పదవీ విరమణ పొందుతున్న ఎస్ఓటు జీఎం జి.వి. కోటిరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ బూర్ల భాస్కర్ రావుకు ఏరియా జీఎం షాలేమ్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.1983 డిసెంబర్ 22న సింగరేణిలో షార్ట్ ఫైరర్‌గా ప్రస్థానం ప్రారంభించిన జి.వి. కోటిరెడ్డి 42 ఏళ్ల సుదీర్ఘ సేవల తర్వాత ఎస్ఓటు జీఎం స్థాయిలో పదవీ విరమణ




పొందుతున్నారు. ఈ సందర్భంగా జీఎం షాలేమ్ రాజు మాట్లాడుతూ అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరడం గర్వకారణమని, కోటిరెడ్డి లాంటి అధికారి ఉద్యోగులకు ఎంతో మేలు చేశారని కొనియాడారు. కొత్తగూడెం ఏరియా ఉత్పత్తిలో ఆయన పాత్ర కీలకమని, ఎంవీటీసీ మేనేజర్‌గా, ఏఎస్ఓగా అందించిన సేవలు మరవలేనివని పేర్కొన్నారు.ఫైనాన్స్ అండ్ అక్కౌంట్స్ విభాగంలో 32 ఏళ్లుగా విశిష్ట సేవలందించిన డిప్యూటీ సూపరింటెండెంట్ బూర్ల భాస్కర్ రావు కూడా పదవీ విరమణ పొందుతున్నారు. ఇద్దరూ తమ విభాగాల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి సంస్థకు విశేష సేవలు అందించారని, వారి సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని జీఎం అభినందించారు. అనంతరం కోటిరెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో పనిచేయడం గౌరవకరమైన అనుభవమని, సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచరులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, మేనేజర్ ఫారెస్ట్రీ రమణారెడ్డి, ఎస్(ఈ అండ్ ఎం) అజ్మీర శ్రీనివాస్, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ సౌజన్య, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రెటరీ సాగర్, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొని శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.

## కరీంనగర్ కొత్త డీఆర్వోగా

# జే స్వామి బాధ్యతల స్వీకరణ

**- కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఆర్వో**



**కరీంనగర్:మే 30(తెలంగాణ వాణి)** కరీంనగర్ జిల్లా కొత్త రెవెన్యూ అధికారి (డీఆర్వో) గా జే స్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాల యంలో పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనకు అధికారు లు,సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.మేడ్చల్-- మల్కాజ్‌గిరి జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జే స్వామికి ప్రభుత్వం ఇటీవల పదోన్నతి కల్పించింది.ఈ మేరకు కరీంనగర్ జిల్లా డీఆర్వోగా నియమితులైన ఆయన శనివారం అధికారి కంగా బాధ్యతలు స్వీకరిం చారు.అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూ ర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.జిల్లా అభివృద్ధి,ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సమన్వ యంతో పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.నూతన డీఆర్వోను కలెక్టరేట్ అధికారులు,ఉద్యో గులు కలిసి అభినందించారు. ఏవోతో పాటు కలెక్టర్ కార్యాల యసిబ్బంది పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌కు చెందిన పలు శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్‌లో సుదర్శన్ సేవలు అభినందనీయం



మందమర్రి మే 30 (తెలంగాణ వాణి విలేకరి) మందమర్రి లయన్స్ క్లబ్ లొలయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సోతుకు సుదర్శన్ సేవలు అభినంద నీయమని ఆయన చేసిన సేవలు సమాజానికి స్ఫూర్తి దాయాకమని ఇండియా లయన్స్ కౌన్సిల్ చైర్మన్ ఘట్టమనేని బాబురావు పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ లో కుటుంబ సమేత పీ ఎస్ టి ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా పాల్గొ న్న మందమర్రి లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు చాటర్ ప్రెసిడెంట్ పాస్ట్ ప్రెసిడెంట్ ప్రస్తుత డిస్ట్రిక్ట్ చైర్మన్ సోతుకు సుదర్శన్ రావు ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఘట్టమ నేని బాబురావు మాట్లా డుతూ లయన్స్ క్లబ్ లో నూతన సభ్యులు చేర్పిస్తు మందమర్రి క్లబ్ ను మరిం త ముందుకు తీసుకు వెళ్ళారని కొనియాడారు. గత 15 సంవత్సరాలుగా మందమర్రి లయన్స్ క్లబ్ లో వందలాది సేవా కార్య క్రమాలు చేసిన సుదర్శన్ మరింత ఎత్తుకు ఎదగా లని అకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మందమర్రి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పూసాల వెంకటరత్నం, సోతుకు రత్నజానకి, పూసా ల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా పోలీస్ అధికారుల
# పదవీ విరమణ వేడుకలు

**- ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం.**
**- దీర్ఘకాలిక సేవలను కొనియాడిన సీపీ.**




**కరీంనగర్:మే 30 (తెలంగాణ వాణి)**కరీంనగర్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు నిరంతర సేవలు అందించి,శనివారం పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీస్ అధికారుల సన్మాన కార్యక్రమం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహిం చబడింది.ఈ వేడుకకు కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ చేసిన అధికారులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, సమాజ రక్షణలో పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుత మైనదని,తమ జీవితంలో అత్యధిక భాగాన్ని ప్రజల శాంతిభద్రతల కోసం కేటాయించి,శనివారం విజయవంతంగా పదవీ విరమణ సాధించడం అభినందనీయమని కొనియాడారు.విధినిర్వహ ణలో వారు చూపిన ప్రతిభ, క్రమశిక్షణ యువ పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, సంతోషంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు.

### పదవీ విరమణ పొందిన అధికారుల వివరాలు

డి.రాధాకిషన్ హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సేవలు అందించిన వీరు,పోలీస్ శాఖలో 42 సంవత్సరాల 02 నెలల 30 రోజుల సుదీర్ఘ సేవలను పూర్తి చేసుకొని పదవీ విరమణ పొందారు. ఎమ్‌డి.అబ్దుల్ ఖదీర్ కరీంనగర్ కార్ హెడ్‌క్వార్ట ర్స్‌లో విధులు నిర్వహించిన వీరు, 42 సంవత్సరాల 02 నెలల 08 రోజుల పాటు విశిష్ట సేవలు అందించి విరమణ పొందారు.

వి.మల్లా రెడ్డి జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన వీరు,పోలీస్ శాఖలో 36 సంవత్సరాల 07 నెలల 14 రోజుల పాటు సేవలందించి పదవీ విరమణ చేశారు. పి.చంద్రమౌళిజగంగాధర పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టే బుల్గా పనిచేసిన వీరు,35 సంవత్సరాల 09 నెలల 16 రోజుల సర్వీసును విజయ వంతంగా పూర్తి చేశారు.కె.లచ్చయ్య కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సేవలు అందించిన వీరు,34 సంవ త్సరాల 04 నెలల 29 రోజుల పాటు విధి నిర్వహణలో భాగస్వామ్యమై నేడు పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ,ఏసీపీ ప్రతాప్ రిజర్వు ఇన్స్పెక్టర్ కిరణ్,జిల్లా పోలీస్ అసోసి యేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్ అధికారు లు,సిబ్బంది మరియు పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెంచిన ఇందన ధరలను ఉపసంహరించుకోవాలి

- ప్రజలపై అధిక ధరల భారం వేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిశీచండి
- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నేత కెచ్చెల రంగారెడ్డి




**కొత్తగూడెం, మే 30 (తెలంగాణ వాణి)** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని, ఎస్.ఐ.ఆర్ ను రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చర్చల రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య డిమాండ్ చేశారు. ఈ ఈ మేరకు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం మెమోరాండం ఇవ్వటం జరిగింది. అలాగే ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి, ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య లు పాల్గొని మాట్లాడు తూ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలోపెంచిన పెట్రోల్,డీజిల్, వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకునే వరకు పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు ఎలాంటి ధరలు పెంచమని ప్రజలకు హామీ ఇచ్చి తర్వాత విపరీతంగా పెట్రోల్,డీజిల్ , వంటగ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలు నడ్డి విరిచారని ఆరోపించారు. అంతేగాక మరోవైపు "ఎస్ ఐ ఆర్" పేరుతో ఓట్ల తొలగింపు కుట్ర చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ మాయమాటలను కుట్రలను కుతంత్రాలను మతం ముసుగులో చేస్తున్న విభజన రాజకీయాలను ప్రజలందరూ అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను తగ్గించే వరకు అన్ని వర్గాల ప్రజలు పోరాడాల్సిన అవసరం ఉందని ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము,జాటోత్ కృష్ణ,ఈసం శంకర్ జిల్లా నాయకులు కల్లూరి కిషోర్ కంగాల కల్లయ్య, వై. గోపాల్ రావు.బానోత్ ధర్మ, బుర్ర వెంకన్న పెద్దబోయిన సతీష్ వాసం బుచ్చిరాజు, పందూరి వీరబాబు, నకిరకంటి నాగేశ్వరావు, రాయబారపు వెంకటేశ్వర్లు, శ్రీరాం కోటయ్య రామారావు, నూపా సరోజిని తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ చేతి పంపుకు అక్రమంగా మోటర్ బిగించిన వ్యక్తిపై సర్పంచ్ చర్య



చర్ల మే 30 (తెలంగాణ వాణి)చర్ల మండలం ఉప్ప ఉప్పరిగుడెం గ్రామంలో మల్లారం గ్రామానికి చెందిన కొర్స. శివ అనే వ్యక్తి దౌర్జన్యంగా ప్రభుత్వ చేతి పంపుకు మోటర్ బిగించుకొని తన ఇంటి నిర్మాణానికి నీటిని వాడుకుంటూ స్థానిక ప్రజలకు తీవ్ర నీటి సమస్యను కలిగిస్తున్నాడు. అక్కడి ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, కొర్స. శివ వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ వస్తున్నాడు.గతంలో పంచాయతీ సిబ్బంది మోటర్ తొలగించమని మంచిగా చెప్పినా పట్టించుకోలేదు. అనంతరం సర్పంచ్ అధికారికంగా నోటీసు జారీ చేసినా అతను లెక్కచేయలేదు. ప్రజలకు తాత్కాలిక నీటి సౌకర్యం కల్పించేందుకు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరకు ఉప్పరిగూడెం సర్పంచ్ నాగలక్ష్మి స్పందించి, పంచాయతీ సిబ్బందితో స్వయంగా వెళ్ళి అక్రమంగా బిగించిన మోటర్‌ను తొలగించి ప్రజలకు న్యాయం చేశారు. ఈ సమస్య పరిష్కారంలో ఉప సర్పంచ్ సోయం. మంగతాయాలు, వార్డు మెంబర్ పాయల. ప్రమీల మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని సహకరించారు. స్థానిక ప్రజలు సర్పంచ్ నాగలక్ష్మి చొరవను ప్రశంసిస్తున్నారు.

# వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన ప్రధాని మోడీ

**- కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం**
**- న్యూడెమోక్రసీ జిల్లా నేత గౌని నాగేశ్వరావు**



**కొత్తగూడెం, మే 30 (తెలంగాణ వాణి)** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం,ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసాయని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు విమర్శించారు.శనివారం మండలంలోని వీరభద్రపురం గ్రామంలోమండల మహాసభకు గౌని నాగేశ్వరావు హాజరై ప్రసంగించారు.దేశంలో నరేంద్ర మోడీ ప్రధానిగా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని,రైతుల హక్కులను కాలరాస్తు..కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.భారతదేశంలో రైతులు ఏ పంటలు పండించాలో అమెరికా ఆదేశాలకు అనుగుణంగా నరేంద్ర మోడీ దేశ రైతులపై రుద్దుతున్నాడని గౌని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.మహాసభ ప్రారంభానికి ముందు కల్తి రామన్న జెండా ఆవిష్కరణ చేసారు.అమరవీరుల సంతాప తీర్మానాన్ని వల్లోజు రమేష్,కార్యదర్శి నివేదికను బి గోపి ప్రవేశపెట్టారు.ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు కామ్రేడ్ వల్లోజు రమేష్ మాట్లాడుతూ జూన్ 2న బూర్గంపాడు మండలం సారపాక లో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ నాయకులు కల్తీ నరసింహారావు,కల్తీ రామన్న,ఐఎఫ్టియు నాయకులు కూరాకుల నరసింహారావు,లిక్కి నరేష్,కల్తి సురేష్,లక్ష్మయ్య,జాతర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రామవరం డిస్పెన్సరీ మూసివేత కుట్రను యాజమాన్యం విరమించుకోవాలి

- వైద్యుల నియామకం చేపట్టకుండా ఆస్పత్రిని మూసివేయడం దుర్మార్గం
- స్టాఫ్ లేరనే సాకుతో వందలాది కార్మిక కుటుంబాల ఆరోగ్యంతో ఆటలాడొద్దు
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్



**కొత్తగూడెం సింగరేణి, మే 30 (తెలంగాణ వాణి)** రామవరం సింగరేణి డిస్పెన్సరీ మూసివేత కుట్రను యాజమాన్యం తక్షణమే విరమించుకోవాలని, ఆస్పత్రిని పునరుద్ధరించాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం అయన మీడియాతో మాట్లాడుతూ రామవరం ప్రాంతంలో నివసిస్తున్న వందలాది మంది సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబాలతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఈ వైద్యశాల ఎంతో కాలంగా వైద్య సేవలు అందిస్తోందని, ఈ ఆస్పత్రిలో కొత్త వైద్యుల నియామకం చేపట్టకుండా, కేవలం ఇద్దరు స్టాఫ్‌తో మందులు ఇచ్చేలా యాజమాన్యం కుట్రపూరితంగా మార్చిందని మండిపడ్డారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగి పదవీ విరమణ పొందడంతో, కొత్తవారిని నియమించకుండా ఆస్పత్రిని ఏకంగా సీల్ చేయడం సరైంది కాదన్నారు. ఈ ఆస్పత్రిని మూసివేయడం వల్ల స్థానిక కార్మిక కుటుంబాలు చిన్నపాటి వైద్య సేవలకు సైతం సుదూర ప్రాంతంలోని ప్రధాన వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారికి ఆర్థికంగా, శారీరకంగా తీవ్ర భారంగా మారుతుందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం మొండివైఖరి వీడి తక్షణమే ఇక్కడ వైద్యులను, సిబ్బందిని నియమించి ఆస్పత్రిని యధావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

# ఐఐఐటి లో సత్తా చాటిన జెడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్ విద్యార్థులు




**తెల్లాపూర్ మే 30 (తెలంగాణ వాణి)**రామచంద్రాపురం మండలంలోని జెడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్ పాఠశాల మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ఇటీవల విడుదలైన ఐఐఐటి ప్రవేశ ఫలితాల్లో పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికై విశిష్ట ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయి. విద్యార్థుల విజయంపై పాఠశాల హెడ్మాస్టర్ టి. భాస్కర్ హర్షం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల కఠోర శ్రమతో పాటు ఉపాధ్యాయుల నిరంతర మార్గనిర్దేశనం ఈ విజయానికి కారణమని తెలిపారు. ఐఐఐటిలో ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ టి. భాస్కర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా నాణ్యమైన విద్యతో గొప్ప విజయాలు సాధించగలరని, ఇదే స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులు ముందుకు రావాలని కోరారు.

# ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేసిన సర్పంచ్ ప్రేమిందర్ నాయక్

**- కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**



కొత్తగూడెం, మే 30 (తెలంగాణ వాణి) లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని హమాలీ కాలనీ పంచాయతీ గుట్టపై చర్చి లైన్ లో కరెంట్ స్తంబాలు లేక ఇబ్బంది పడుతున్న వారికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి శనివారం నూతన కరెంట్ స్తంబాలు వేయించి విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు సర్పంచ్ గుగులోత్ ప్రేమిందర్ నాయక్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహ కారంతో పాటుగా పంచాయతీ పాలకవర్గంతో కలిసి కృషి చేస్తున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరితో కలిసి ముందుకు వెళ్తానన్నారు. కరెంటు స్తంభాలు లేక సరైన విద్యుత్ కనెక్షన్ లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న చర్చి రోడ్డుకు నూతన వెలుగులు అందించిన సర్పంచ్ ప్రేమిందర్, ఉపసర్పంచ్ తాళ్లపల్లి రాజు, పాలకవర్గ సభ్యులకు, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, గ్రామ పెద్దలు మల్లు జ్యోతిబసు, లైన్ మెన్ రాధకృష్ణ, తోట రమేష్ లకు గ్రామస్తులు అభినందనలు తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శులను సన్మానించిన బోథ్ ఎంపీడీఓ రమేష్, ఎంపీవో రాజ్ కుమార్



**బోథ్,మే 30(తెలంగాణా వాణి ప్రతినిధి):**ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా బోథ్ మండలం నుండి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందిని శాలువతో సన్మానించడం జరిగింది.గత కొన్ని సంవత్సరాలుగా బోథ్ మండలంలో వారు అందించిన సేవలు మరువలేనివి అని కొనియాడడం జరిగింది.ఉద్యోగులకు బదిలీ సహజమని ఎక్కడ పనిచేసిన క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేసి గుర్తింపు పొందాలని సూచించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో పర్యవేక్షకులు రాజేశ్వర్,ఈసీ మధు,పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది,ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక | The Voice of Telangana



## ప్రైవేటు బస్సులో మంటలు..ప్రయాణికులు క్షేమం

**నల్గొండ** నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై బస్సును ఆపడంతో అందులోని 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు, పోలీసులు ఘటనస్థలికి చేరుకుని సహాయచర్యలు చేపట్టారు.

## మహిళ హత్యకేసులో నిందితులు అరెస్టు

**మచిలీపట్నం** కృష్ణా జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. గన్నవరం దావాజీ గూడెం జి ఆర్ కె పారడైజ్ అపార్ట్మెంట్లో కాజా రజిత కుమారి (55)హత్య కేసులో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఎస్పీ మాట్లాడుతూ ఒంటరిగా ఉన్న మహిళతో సన్నిహితంగా మెలిగి బంగారం డబ్బులు కోసం హత్య చేసిన నిందితుల నుండి 56 లక్షల విలువచేసే సొత్తు, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. గన్నవరం దావజీగూడెం జి ఆర్ కె అపార్ట్మెంట్లో నివాసం ఉండే కాజ రజిత కుమారి( 55) హత్య కేసుల్లో నిందితులుగా పోలవరపు సుష్మ (43) పోలవరపు అజయ్ కుమార్(25) లను అదుపులో తీసుకున్నామని అన్నారు. అపార్ట్మెంట్లోని సీసీ కెమెరాలు ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడం జరిగింది. కేసు దర్యాప్తు లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు.

### 3000 కొత్త ఈవీ బస్సులతో

## ఆర్టీసీకి కొత్త రూపు

**- భోగాపురం ఎయిర్పోర్ట్కు విజయవాడ నుంచి 40 ప్రత్యేక బస్సులు**
**- మంత్రి మండిపల్లి**

**విజయవాడ** 3000 కొత్త ఈవీ బస్సులతో ఆర్టీసీకి కొత్త రూపు రానుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. – ఆర్టీసీ అభివృద్ధిపై సీఎం అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం తరువాత మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ ఆధునీకరణకు కీలక నిర్ణయాలు తీసుకున్నాం. గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆర్టీసీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది. స్త్రీ శక్తి పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. రాష్ట్రంలో దశలవారీగా ఈవీ బస్సుల విస్తరణకు కార్యాచరణ సిద్ధం. తొలి దశలో 700 ఈవీ బస్సులు రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయని అన్నారు.జూలైలో 6 డిపోలలో ఈవీ బస్సుల నిర్వహణకు మౌలిక సదుపాయాలు సిద్ధం అవుతాయి.

మహావాస్ పథకం కింద 300 ఈవీ బస్సుల కేటాయింపు వుంటుంది. మరో 500 ఈవీ బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తి అయింది. రాష్ట్రవ్యాప్తంగా 3,000 ఈవీ బస్సుల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం. కాలుష్య నియంత్రణలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని సీఎం ఆదేశం. భోగాపురం ఎయిర్పోర్ట్కు విజయవాడ నుంచి 40 ప్రత్యేక బస్సులు నడుస్తాయి. గోదావరి పుష్కరాలకు "గోదావరి" అనే పేరుతో ప్రత్యేక బస్సు సర్వీసులు వుంటాయి. అన్ని ఘాట్ల వద్ద పుష్కరాల ఏర్పాట్లు సిద్ధం అయ్యాయి. కొత్త ఈవీ బస్సులు ఆధునిక సౌకర్యాలతో అందుబాటులోకి రానున్నాయి. రానున్న రోజుల్లో పల్లెవెలుగు నుంచి ఎక్స్ప్రెస్ వరకు అన్ని విభాగాల్లో ఈవీ బస్సుల వినియోగం వుంటుంది. స్త్రీ శక్తి పథకం ఆర్టీసీపై భారం కాదు బాధ్యత. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు. – ఏపీఎస్ఆర్టీసీకి ప్రజలకు మధ్య విడదీయరని అనుబంధం ఉంది.– పీపీపీ విధానంలో డిపోల ఆధునీకరణ చేపడతాం. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది. రెండేళ్లలో నైట్ అలవెన్స్ సహా ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారం చేశాం. 3000 కొత్త ఈవీ బస్సులతో ఆర్టీసీకి కొత్త రూపు రానుందని అన్నారు.

### అమీర్‌పేటలో ఎన్టీఆర్

## విగ్రహ ఏర్పాటు హర్షణీయం

**– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాట్రగడ్డ ప్రసూన కృతజ్ఞతలు**

**హైదరాబాద్:**తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన మహానాయకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్‌పేట కూడలిలో ప్రతిష్ఠించడం పట్ల సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకుని, విగ్రహ ఏర్పాటుకు సహకరించిన గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు.?ఈ సందర్భంగా కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ.. "తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న అన్న నందమూరి తారకరామారావు గారి విగ్రహాన్ని అమీర్‌పేట లాంటి ఒక ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయడం తెలుగుజాతికి గర్వకారణం. ఎన్టీఆర్ కేవలం ఒక పార్టీకో, ప్రాంతానికో పరిమితమైన నాయకుడు కాదు.. ఆయన యావత్ తెలుగుజాతి ఆస్తి. అలాంటి మహానుభావుడి సంస్మరణకు, వారి కీర్తిని సమున్నతంగా నిలపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చూపిన చొరవ, పెద్దమనసు నిజంగా అభినందనీయం" అని కొనియాడారు.రాజకీయాలకు అతీతంగా, తెలుగు సంస్కృతిని, నాయకత్వ పటిమను రేవంత్ రెడ్డి దృక్పథం ఈ నిర్ణయంతో మరోసారి రుజువైందని ఆమె పేర్కొన్నారు. ఈ విగ్రహ ఏర్పాటు అమీర్‌పేట పరిసర ప్రాంతాల ప్రజలకే కాకుండా, నగరాసికులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ప్రసూన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం

**తిరుమల** చెన్నైకి చెందిన ప్రముఖ భక్తుడు విష్ణువర్ధన్ టీటీడీకి ఆధునిక ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా సమర్పించారు. శ్రీవారి ఆలయం సమీపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బస్సు తాళాలను టీటీడీ అధికారులకు అందజేశారు ఈ బస్సును తిరుమలలో భక్తుల ఉచిత రవాణా సేవల కోసం వినియోగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తిరుమలలో ఇప్పటికే పలు ఎలక్ట్రిక్ "ధర్మరథం" బస్సులు నడుస్తుండగా, కొత్త బస్సు చేరికతో సేవలు మరింత విస్తరించనున్నాయి. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీటీడీ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాల వైపు అడుగులు వేస్తోందని అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఉచిత బస్సు సౌకర్యాలు మరింత బలోపేతం చేయాలని టీటీడీ యోచిస్తోంది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బివిఆర్ నాయుడుఅదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులు పాల్గొన్నారు

## సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా

### త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

**కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్**

**కాళేశ్వరం** సరస్వతి నది అంత్య పుష్కరాల సందర్భంగా పవిత్ర గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదుల త్రివేణి సంగమం వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు.

అనంతరం సంగమ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని ఆ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని ప్రార్థించానని తెలిపారు.

## వైకుంఠం క్యూ కాంప్లెక్స్లో నిండిపోయిన కంపార్ట్మెంట్లు

**తిరుమల** వైకుంఠం క్యూ కాంప్లెక్స్లోని అనేక కంపార్ట్మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. సర్వదర్శనం భక్తులకు సుమారు 21 నుంచి 28 గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. తిరుమల ఘాట్ రోడ్లపై వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. శ్రీవారి ఉచిత దర్శనం కోసం వచ్చిన భక్తులతో క్యూ లైన్లు కిలోమీటర్ల మేర విస్తరించాయి ప్రత్యేక ప్రవేశ దర్శనం (300) టికెట్లు ఉన్న భక్తులకు కూడా 2 నుంచి 4 గంటల వరకు నిరీక్షణ ఉండొచ్చని సమాచారం. టీటీడీ అధికారులు అదనపు భద్రతా సిబ్బంది, తాగునీరు, అన్నప్రసాదం, వైద్య సేవలు ఏర్పాటు చేశారు.

### సమాజానికి దిశానిర్దేశం చేసే

# టార్చిలైట్‌లా వార్తలు ఉండాలి..!!

**- కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**
**- రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణ విలేకరులకు**
**- రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభం**






**బద్వేలు** మీడియా అందించే ప్రతి వార్త సమాజానికి వెలుగు చూపే టార్చిలైట్‌లా ఉండాలని, ప్రజలను ఆలోచింపజేస్తూ సామాజిక మార్పుకు వారధిగా నిలవాలని కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా గ్రామీణ విలేకరులకు సూచించారు.శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అధ్యక్షత వహించగా, శిక్షకులుగా సీనియర్ పాత్రికేయులు, రచయిత ఉమామహేశ్వరరావు, ఎపియుడబ్ల్యుజె జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు రామసుబ్బారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మీడియా ప్రతినిధులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ నాల్గవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం, త్వరలోనే మూడో స్థానానికి చేరుకునే దిశగా పయనించడం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. దేశ అభివృద్ధిలో మీడియా పాత్ర అత్యంత కీలకమైన పాత్ర పోషించే స్థాయిలోకి ఎదగాలని సూచించారు.ప్రస్తుతం మీడియా ద్వారా అందుతున్న సమాచారం సమాజానికి, ప్రభుత్వ పరిపాలనకు పరిమిత స్థాయిలో మాత్రమే ఉపయోగపడుతోందని, భవిష్యత్తులో వార్తలు ప్రజల జీవితాలను ప్రభావితం చేసే విధంగా, కనీసం 70 శాతం మేర ఉపయోగకరంగా ఉండేలా విలేకరులు తమ ఆలోచనా విధానాన్ని, విశ్లేషణాత్మక దృష్టిని విస్తరించుకోవాలని సూచించారు."

వార్త అనేది కేవలం సంఘటన వివరణ మాత్రమే కాదు; అది సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి. ప్రజల్లో చైతన్యం పెంచుతూ, సమస్యలపై చర్చకు దారి తీస్తూ, పరిష్కార మార్గాలను సూచించగలగాలి" అని ఆయన సూచించారు.ఇరవై ఏళ్ల క్రితం సమాజంలో, పరిపాలనలో కనిపించిన ప్రశ్నించే తత్వం ప్రజాస్వామ్యానికి బలమని, ఆ విలువలను తిరిగి బలోపేతం చేసే దిశగా మీడియా కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, నిర్మాణాత్మక చర్చకు దోహదపడే కథనాలను అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు.

### యువతకు ఉపాధి కల్పించమే ధ్యేయంగా

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తోంది...

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

బాలాజీ కాలనీలోని ఎస్ విసిసి డిగ్రీ కాలేజిలో శుక్రవారం ఉదయం జాబ్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు . జాబ్ మేళాలో పాల్గొన్న 22 ఎం ఎన్ సి కంపెనీలు 800 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించడం సంతోషం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గారు. జాబ్ మేళాలను యువత ఉపయోగించుకోవాలని కోరిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

.ఈ కార్యక్రమం లో బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ , బిజెపి సీనియర్ నాయకులు పొనగంటి భాస్కర్ , రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వర ప్రసాద్, మరియు ఎన్డీఏ కూటమి నాయకులు, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### జూన్ 2న శ్రీ వేణుగోపాలస్వామివారి

## ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కార్వేటినగరంలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జూన్ 2వ తేదీ ఉదయం 7.30 గంటల నుండి 11 గంటల వరకు వైభవంగా జరుగనుంది. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు జూన్ 6 నుండి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఆలయ సంప్రదాయం ప్రకారం బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను పవిత్ర జలాలతో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు.ఈ మహోన్నత కార్యక్రమం అనంతరం ఉదయం 11.30 గంటల నుండి భక్తులను స్వామివారి సర్వ దర్శనానికి అనుమతించనున్నారు.

### బిఆర్ఎస్ నేత చెన్నూరు

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

**హైదరాబాద్**బిఆర్ఎస్ నేత చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను తెలంగాణ భవన్ దగ్గర పోలీసులు అరెస్ట్ చేసారు. తరువాత నాంపల్లి పీఎస్ కు తరలించారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బాల్కసుమన్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, 3 రోజుల క్రితం సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో ఈరోజు ఉదయం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

ఇటీవల సింగరేణి జీఎం కార్యాలయాన్ని తగలబెట్టాలంటూ బాల్క సుమన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు., ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు మిలిటెంట్ తరహాలో ఉధృత పోరాటాలు చేయాలని ఆయన పిలుపుని చ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ నమోదైన కేసుల ఆధారంగానే పోలీసులు ఈ రోజు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్ అరెస్ట్ వార్తతో నాంపల్లి కోర్టు పరిసరాల్లో పోలీసుల బందోబస్తును భారీగా పెంచారు.మరోవైపు తన అరెస్ట్ వార్తలను మాత్రం బాల్క సుమన్ ఖండించారు. తాను తెలంగాణ భవన్లోనే ఉన్నానని, అరెస్టు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటానని తెలిపారు.

### చిత్తూరు జిల్లా వ్యాప్తంగా

## కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు

**చిత్తూరు** ప్రజల భద్రత, రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకొని, నేరాలు మరియు అక్రమ రవాణాను అరికట్టేందుకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా విస్తృతమైన కార్డన్ అ సెర్చ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అనుమానాస్పద వ్యక్తులపై తనిఖీలు, వాహనాల పరిశీలన, నేరస్థుల కదలికలపై పర్యవేక్షణ, అక్రమ రవాణా నిరోధక చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యం నేరాలను ముందస్తుగా అరికట్టి, ప్రజల్లో భద్రతా వాతావరణాన్ని బలపరచడం. ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిధ్యం స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవడం ద్వారా, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడమే ఈ ఆపరేషన్ యొక్క ముఖ్య లక్ష్యం అని అధికారులు పేర్కొన్నారు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాలను గమనిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.
సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసుల సహాయాన్ని పొందవచ్చని సూచించారు.ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే దిశగా హెల్మెట్ అవేర్నెస్ మరియు రోడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమాలు కూడా నిర్వహించబడినవి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాలకు ప్రమాదంగా మారుతుందని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు విభాగం సమన్వయం, స్థానిక ప్రజల సహకారం తో ఈ కార్డన్ అ సెర్చ్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి అయింది. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిరంతరంగా కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

### డీఎస్సీ నియామకాలపై వైసీపీ ఆరోపణలను

## ఖండించిన డీఎస్సీ అభ్యర్థులు, టీడీపీ నేతలు

**తిరుపతి** డీఎస్సీ నియామకాలపై వైసీపీ ఆరోపణలను డీఎస్సీ అభ్యర్థులు, టీడీపీ నేతలు ఖండించారు. మెగా డీఎస్సీతో 16,347 మందికి కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది. డీఎస్సీ పూర్తిగా పారదర్శకంగా జరిగింది.. లంచాల ఆరోపణలు అవాస్తవం. ఉద్యోగాలు అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేయడం దుర్మార్గమని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ను కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్పోర్ట్స్ కోటా నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయని స్పష్టం. ఏళ్ల తరబడి కష్టపడి ఉద్యోగాలు సాధించాం.. మమ్మల్ని అవమానించొద్దని డీఎస్సీ అభ్యర్థులు అన్నారు. ఉపాధ్యాయులను, డీఎస్సీ ఎంపికైన వారిని రాజకీయాల్లోకి లాగొద్దని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అన్నారు. డీఎస్సీ నియామకాలపై నిరాధార ప్రచారం ఆపాలని డిమాండ్ చేసారు.శ్యాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ భవిష్యత్తు ఉద్యోగ నియామకాలను అడ్డుకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

## మార్నింగ్ వాక్‌కు వెళ్లే మహిళలే లక్ష్యం

మత్తుకు బానిసై దోపిడీలకు పాల్పడిన ముఠా అరెస్ట్సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మత్తుకు బానిసలైన నలుగురు యువకులు దోపిడీలకు పాల్పడుతూ చివరకు పోలీసులకు చిక్కారు. ఎల్లమ్మబండకు చెందిన ఈ యువకులు ఒకవైపు ఆటో నడుపుతూ, వెల్డింగ్ పనులు చేసుకుంటూనే జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం నేరాల బాట పట్టారు.గత నెల రోజులుగా ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని, ఒంటరిగా వెళ్తున్న వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కొని పరారవుతున్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నలుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దోచుకున్న బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన జీడిమెట్ల పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### కొట్యా తండాలో పోలీసుల

## కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం







**మహబూబాబాద్** జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మరిపెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొట్యా తండా గ్రామానికి చెందిన చావుల్లా తండా, జాలి తండా, అర్లగడ్డ తండాలలో ఈ రోజు కమ్యూనిటీ కాంటాక్ట్ మరియు ఏరియా డామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు ఇంటింటి తనిఖీలు చేపట్టి సుమారు 100 ఇళ్లు పరిశీలించారు.తనిఖీల్లో రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్లు, పత్రాలు లేని 10 వాహనాలను గుర్తించి విచారణకు తీసుకున్నారు. అలాగే 400 కిలోల నల్ల బెల్లం, 50 లీటర్ల గుడుంబా, 50 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల బెల్లం పులుసును గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించి చోరీలు, రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సైబర్ నేరాలు, గంజాయి నివారణ, సీసీ కెమెరాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# ఆ మూడు తప్ప... వైసీపీ టార్గెట్ 172



**విజయవాడ,** వైసీపీ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడుతోంది. నిన్న తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయకర్తలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకునేది లేదని.. ఏకంగా నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు పడుతుందని హెచ్చరించినంత పని చేశారు. అయితే అక్కడే ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు.. బాధ్యతలు చూస్తున్న తమపై కాదు.. ఆ కీలక నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి అన్నట్టు అంతర్గత చర్చల్లో చెబుతున్నారు వైసీపీ నేతలు. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి, పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కనీసం వైసిపి ఉనికి లేదు. నేతల జాడలేదు. ముందుగా అక్కడ పని చూడండి అన్నట్టు వైసిపి నేతల సూచన ఉంది. గత రెండేళ్లలో ఆ మూడు నియోజకవర్గాల్లో వైసిపి చేసిన కార్యక్రమం అంటూ లేకపోవడం విశేషం.వై నాట్ కుప్పం అంటూ సౌండ్ చేశారు వైసీపీ నేతలు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా కుప్పంను గెలిచేస్తాం అంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటివారు పెద్దదిక్కుగా మారిపోయారు. తన పుంగనూరు విడిచిపెట్టి మరి కుప్పం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. భరత్ అనే నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. చంద్రబాబును సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టనీయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క పదవి కూడా వదలకుండా అంతా తీసుకున్నారు. అభివృద్ధి పనులు కూడా పగబట్టి మరీ చేశారు. కానీ కుప్పం ప్రజలు మాత్రం మళ్లీ చంద్రబాబునే పట్టం కట్టారు. ప్రస్తుతం అక్కడ వైసిపి ఇన్చార్జిగా ఉన్న భరత్ జాడలేదు. వైసిపి కార్యక్రమాలు జరగడం లేదు. పట్టించుకునే నాధుడు కూడా అక్కడ లేడు.ఇక మంగళగిరి విషయానికి వస్తే లోకేష్ మానియా నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి లోకేష్ వినూత్న తరహాలో ముందుకు వెళ్తున్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఎంతలా అంటే ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా. 2019లో ఓడిపోయిన తర్వాత సొంత ఖర్చుతో అభివృద్ధి చేసి చూపించారు. ఇప్పుడేమో ప్రభుత్వపరంగా చేసి చూపిస్తున్నారు. గతంలో ఉన్న వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి జాడలేదు. మొన్న పోటీ చేసిన మహిళా నేత కనిపించడం లేదు. పైగా అక్కడ మాజీ మంత్రి ఒకరు లోకేష్ పట్ల అనుకూల ప్రకటనలు చేస్తున్నారు.పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు లేవు. మొన్నటి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు ముద్రగడ పద్మనాభం. అయితే ఓడించలేక తన పేరు మార్చుకున్నారు ముద్రగడ పద్మనాభ రెడ్డి గా. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెండ్యం దొరబాబు సైతం జనసేనలోకి వచ్చేసారు. పవన్ కళ్యాణ్ పై పోటీ చేసిన వంగా గీత ఆచూకీ లేదు. కనీసం అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు లేవు. ఈ మూడు చోట్ల ముందు చూడండి.. తరువాత మాట్లాడండి అన్నట్టు ఉంది వైసీపీ నేతల వ్యవహార శైలి.

### గుడివాడలో నాని చేతులెత్తేశారా....

మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వైఎస్ జగన్ తో జరిగిన సమావేశంలో పాల్గొన్న కొడాలి నాని గుడివాడకు మాత్రం వెళ్లలేదు. 2024 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత కొడాలి నాని గుడివాడకు దూరమయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గుండెకు శస్త్ర చికిత్స జరగడం కొడాలి నాని హైదరాబాద్ కు మాత్రమే పరిమితమయ్యారు. ఏదైనా పోలీస్ స్టేషన్ కు రావాల్సినప్పుడే గుడివాడకు వస్తున్నారు తప్పించి అంతకు మించి ఆయన ప్రత్యేకంగా గుడివాడ వచ్చి వైసీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనలేదు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంత వరకూ గుడివాడలో కార్యకర్తలతో భేటీ కూడా జరపలేదు.కొడాలి నాని మాత్రం గుడివాడలోని తన ముఖ్య అనుచరులతో టచ్ లోనే ఉన్నారు. హైదరాబాద్ లోనే ఎక్కువ కొడాలి నాని ఉంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో ఇప్పుడే రావడం అనవసరమని కొడాలి నాని భావిస్తున్నట్లుంది.

గత ఎన్నికల్లో తన ఓటమిని జీర్ణించుకోలేని కొడాలి నాని తాను నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినా ప్రజలు తనను ఓడించడంపై ఒకింత అసంతృప్తితో తొలుత ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. గుడివాడ నియోజకవర్గంలోతొలి సారి ఓటమి పాలయిన తర్వాత గుడివాడకు పూర్తి దూరం పాటిస్తున్నారు. విజయవాడ వరకూ వచ్చి గుడివాడకు వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది.2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. కానీ ఇప్పుడు గుడివాడకు వచ్చినా చేసేదేమీ లేదని, ఎన్నికలకు ఏడాది ముందు వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

### కృష్ణా , విజయనగరం రైతులకు

# జపాన్ ఎఫెక్ట్...

**విజయవాడ,** భారత మామిడి పండ్లపై జపాన్ ప్రభుత్వం విధించిన తాజా నిషేధం ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా, ఖమ్మం విజయనగరం జిల్లాల మామిడి రైతులకు మరియు ఎగుమతిదారులకు పెద్ద షాక్‌గా మారింది. ఏపీలో అత్యధికంగా పండే, ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న 'బంగినపల్లి' రకం మామిడి కాయల ఎగుమతులపై ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బ తీయనుంది. జపాన్ మార్కెట్‌లో ఏపీ మామిడి పండ్లకు చాలా ఎక్కువ ధర లభిస్తుండటంతో, ఈ నిషేధం వల్ల ఇక్కడి వ్యాపారులు, రైతులు కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.నిజానికి ఏపీ నుండి జపాన్‌కు మామిడి కాయలను ఎగుమతి చేసే ముందు నాణ్యతా ప్రమాణాల కోసం వాటికి వేపర్ హీట్ ట్రీట్మెంట్ చేయడం తప్పనిసరి. అయితే, ఉత్తరప్రదేశ్‌లోని ఒక ట్రీట్మెంట్ ప్లాంట్‌లో క్వారంటైన్ నిబంధనలు, పురుగుల నివారణ ప్రక్రియల్లో లోపాలు ఉన్నట్లు జపాన్ ఫుడ్ అఫీషియల్స్ గుర్తించారు. జపాన్ దేశం పండ్ల ఈగల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తుంది. ఒక ప్రాంతంలో లోపం జరిగినా, దాని ప్రభావం దేశవ్యాప్త ఎగుమతులపై పడటంతో ఏపీలోని అత్యాధునిక ప్యాక్ హౌస్‌ల ద్వారా ఎగుమతి చేసే రైతులు కూడా ఇప్పుడు నష్టపోవాల్సి వస్తోంది.ఈ ఏడాది ఇప్పటికే ఏపీలోని మామిడి రైతులకు వాతావరణం ఏమాత్రం కలిసిరాలేదు. ఎల్ నినో ప్రభావం వల్ల మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన విపరీతమైన ఎండలు, అకాల వాతావరణ మార్పుల కారణంగా పూత ఎండిపోయి, కాయ రాలిపోయి ఇప్పటికే 60 శాతం పైగా పంట నష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి కష్టాల్లో ఉన్న రైతులకు, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర దక్కుతుందనే ఆశ ఉండేది. కానీ కచ్చితంగా సీజన్ పీక్ స్టేజ్‌కు చేరే సమయంలో జపాన్ ఈ నిషేధాన్ని విధించడం ఏపీ మామిడి రైతులకు గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది.ఇప్పుడు ఏపీ ఎగుమతిదారులు భయపడుతున్న మరో ముఖ్యమైన అంశం ఏంటంటే.. జపాన్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయం వల్ల అంతర్జాతీయంగా భారతీయ క్వాలిటీ కంట్రోల్ సిస్టమ్స్‌పై నమ్మకం తగ్గే అవకాశం ఉంది. జపాన్ బ్యాన్‌ను చూసి ఏపీ మామిడిని భారీగా దిగుమతి చేసుకునే ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలు లేదా గల్ఫ్ దేశాలు కూడా తనిఖీలను కఠినతరం చేస్తే ఏపీ మామిడి మార్కెట్ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉంది. ఏపీ ప్రభుత్వం, అపెడా అధికారులు తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడి, ఈ సాంకేతిక లోపాలను సవరించి జపాన్‌తో మళ్లీ చర్చలు జరపాలని రైతులు కోరుతున్నారు.

## మద్యం స్కాంలో బుక్కైన విజయసాయి

**నెల్లూరు,** ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఒకవైపు విచారణ చేపడుతుండగా.. సమాంతరంగా ఈడి కూడా దర్యాప్తు చేస్తోంది. తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ మాజీ నేత విజయసాయిరెడ్డిని పిలిచి మరి విచారణ చేసింది ఈడి. ఏకంగా ఏడు గంటల పాటు విచారణ కొనసాగింది. విజయసాయిరెడ్డిని ఈడి విచారణ చేపట్టడం ఇది మూడోసారి. అయితే ఈసారి విజయసాయిరెడ్డి మొబైల్ ఫోన్ చుట్టూ విచారణ కొనసాగినట్లు సమాచారం. గతసారి ఈడి తనిఖీల సమయంలో విజయసాయిరెడ్డి వ్యక్తిగత ఫోన్ ను ఈడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా దర్యాప్తులో భాగంగా విజయసాయిరెడ్డి ఎదుట ఆ సెల్ ఫోన్ లో ఉన్న వివరాలను ఫోరెన్సిక్ నిపుణులు క్లోనింగ్ చేపట్టారు. ల్యాబ్ నివేదిక వచ్చిన వెంటనే మరోసారి విజయసాయిరెడ్డిని విచారించే అవకాశం ఉంది.దాదాపు 7 గంటల పాటు ఈడి ఎదుట ఉండిపోయారు విజయసాయిరెడ్డి. హైదరాబాదులోని ఈడీ కార్యాలయం వద్ద ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. దర్యాప్తు అనంతరం మీడియా ముందుకు వచ్చిన విజయసాయిరెడ్డి అసలు తనను విచారణ చేపట్టలేదని.. తన సమక్షంలో ఫోన్లో ఉన్న వివరాలను తీసుకున్నారని చెప్పుకొచ్చారు. ల్యాబ్ నివేదిక వచ్చిన వెంటనే మరోసారి సమన్లు జారీ చేసి తనను పిలిచే అవకాశం ఉందని విజయసాయిరెడ్డి స్వయంగా పేర్కొనడం విశేషం. అయితే ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదు అని.. మొత్తం వ్యవహారం నడిపింది రాజ్ కసిరెడ్డి అని.. ఈ విషయం ఎన్నిసార్లు అడిగినా చెబుతానని తేల్చి చెప్పారు విజయసాయిరెడ్డి.అయితే ఇప్పుడు విజయసాయిరెడ్డి ఫోన్ కీలకంగా మారింది. ఐదేళ్లపాటు వైసీపీ హయాంలో విజయసాయిరెడ్డి ద్వారా జరిగిన లావాదేవీల లోగుట్టులు బయటపడే అవకాశం ఉంది. మద్యం కంపెనీల విషయంలో తాను మధ్యవర్తిత్వం వహించానని.. ఇప్పటికే పలుమార్లు హింట్ ఇచ్చారు విజయసాయిరెడ్డి. ఇప్పుడు ఏకంగా ఆయన సెల్ఫోన్ దొరకడంతో ఈడి అధికారులు డొంక మొత్తం కదిలించనున్నారు. విజయసాయిరెడ్డి నేరుగా చెప్పడం కంటే తన సెల్ ఫోన్ ద్వారా మొత్తం గుట్టు రట్టు చేశారు అనడం వాస్తవం. వైసిపి హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని విజయసాయిరెడ్డి ఒప్పుకున్నారు. ఇప్పటికీ అదే స్టాండ్ పై ఉన్నారు. అంటే మద్యం కుంభకోణంలో ఆయన అప్రూవర్ గా మారారు అన్నమాట. కానీ తనకు మద్యం కుంభకోణంతో సంబంధం లేదని.. తాను అప్రూవర్ గా మారలేదని చాలాసార్లు చెప్పారు విజయసాయిరెడ్డి. కానీ తన సెల్ ఫోన్ చుట్టూ విచారణ కొనసాగుతోందని.. మరోసారి ఇది తనను పిలిచే అవకాశం ఉందని స్వయంగా విజయసాయిరెడ్డి ధ్రువీకరించడం విశేషం.

## జగన్ మూడో కూటమి వైపు చూపు....

**కడప,** బిజెపి విషయంలో జగన్మోహన్ రెడ్డి స్టాండ్ మారుతున్నట్లు అర్థం అవుతోంది. ఢిల్లీ వర్గాల్లో సైతం ఇది చర్చకు దారితీస్తుంది. వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తే జగన్మోహన్ రెడ్డి ఒక పక్కా ఆలోచనతో అడుగులు వేస్తున్నట్లు స్పష్టమౌతోంది. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ పెంపును నిరసిస్తూ ఆందోళనలు, పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ఓటమికి ఆయన విశ్లేషిస్తున్న కారణాలు.. భారతీయ జనతా పార్టీకి కోపం తెప్పిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బిజెపిని నమ్ముకుంటే రాజకీయంగా తనకు ఇబ్బందులు తప్పవని జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీలో ఎన్డీఏ కూటమి బలంగా ఉన్న నేపథ్యంలో.. తనకు జాతీయస్థాయిలో ఏదో ఒక కూటమి అండ ఉండాలని ఆయన భావిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది ఢిల్లీ వర్గాల్లో. ఈ విషయం బిజెపి పెద్దల వరకు తెలియడంతో వారు సైతం జగన్మోహన్ రెడ్డి విషయంలో సాఫ్ట్ కార్నర్ విడిచి పెట్టే పరిస్థితి కనిపిస్తోంది.ఏపీలో ప్రత్యేక ఓటరు సవరణ చేపడుతున్న సంగతి తెలిసిందే. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. రాజకీయ ప్రత్యర్థుల ఓట్లను తొలగించడమే దీని వెనుక ఉన్న ఎత్తుగడ అని చెబుతున్నారు జగన్. బెంగాల్లో మమతా బెనర్జీ ఓటమికి ఓటరు జాబితా సవరణ కారణం అని తేల్చి చెప్పారు. తద్వారా బిజెపి గెలుపును తప్పుపట్టారు.

ఎన్నికల సంఘం నిర్ణయాలను సైతం ఎత్తిచూపుతున్నారు. మొన్నటికి మొన్న డీజిల్ పెట్రోల్ ధర పెంపు పై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. పశ్చిమ ఆసియా పరిణామాల క్రమంలో పెంపు అనివార్యం అని తెలిసి కూడా.. ఇలా ఆందోళనలు చేయడం ఏంటనేది బిజెపి పెద్దల ప్రశ్న. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి బిజెపితో కటీఫ్ చెప్పేందుకే నిర్ణయించినట్లు తెలుస్తోందిప్రస్తుతం ఏపీలో కూటమి బలంగా ఉంది. పైగా మూడు పార్టీల మధ్య సంబంధాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బిజెపిని నమ్ముకుంటే ఇబ్బందులు అని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. క్రమేపి కాంగ్రెస్ పెద్దలతో ఆయన రహస్యంగా మంతనాలు జరుపుతున్నట్లు కూడా ప్రచారం ఉంది. తమిళనాడులో విజయ్ గెలుపుతో దక్షిణాది రాష్ట్రాల్లో ఒక ప్రత్యేక రాజకీయ శక్తిగా అవతరించాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే జగన్మోహన్ రెడ్డి వైఖరిలో వచ్చిన ఈ మార్పుతో బిజెపి పెద్దలు సైతం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. వైసిపి తో పాటు జగన్ విషయంలో సాఫ్ట్ కార్నర్ తగ్గించుకోవాలని పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## డికె పదవీ స్వీకారానికి సిద్ధం

) నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం.. ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో విజయాలు.. పార్టీకి ట్రబుల్ షూటర్గా, ప్రత్యర్థులకు 'కనకపుర బండ'గా పేరుపొందిన ఒక క్షేత్రస్థాయి నాయకుడు ఇప్పుడు రాష్ట్ర అత్యున్నత పీఠాన్ని అధిరోహించబోతున్నారు. ఆయనే కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయడంతో, కర్ణాటక నూతన సారథిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.సిద్ధరామయ్య తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కార్యాలయానికి సమర్పించారు.

దీంతో డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధమైంది. అయితే ఈ స్థాయికి చేరడానికి ఆయన ప్రయాణం పూలపాన్పు కాదు. 1980లలో విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన శివకుమార్, 1989లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, ఇప్పటివరకు ఎనిమిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై 'అపజయం ఎరుగని నేత'గా తన పట్టు నిలుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి కష్టకాలం వచ్చిన ప్రతీసారి డీకే శివకుమార్ ముందుండి సమస్యలను పరిష్కరించేవారు. అందుకే ఆయనకు పార్టీలో 'ట్రబుల్ షూటర్' అనే పేరు స్థిరపడింది. అయితే, ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కఠినమైన దశ కూడా ఎదురైంది. మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయనను అరెస్ట్ చేయడంతో సుమారు 50 రోజులు తిహార్ జైలులో గడపాల్సి వచ్చింది

## మే నెలలో తలనీలాల రికార్డు

**తిరుమల** తిరుమలలో తలనీలాల సమర్పణలో ఏటికేడు కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. మే నెలలో గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయిలో తలనీలాల సమర్పణ జరిగినట్లు తెలిపింది. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా కళ్యాణకట్టల వద్ద ఏర్పాట్లు చేశామని.. పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది.తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే మే నెలలో కొత్త రికార్డులు నమోదు చేసింది. గత సంవత్సరాల కంటే 2026 మే నెలలో అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేపట్టి, నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఇక ఈ ఏడాది మే నెలలో 14,43,063 మంది భక్తులు తిరుమల శ్రీవారికి తమ తలనీలాలు సమర్పించుకున్నారు. 2024 మే నెలలో 10,65,729 మంది భక్తులు, 2025 మేలో 10,18,370 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుంటే.. ఈ ఏడాది మే నెల కొత్త రికార్డులు నమోదు చేసింది.మరోవైపు ఇటీవల వేసవి సెలవులు, వారాంతపు రద్దీతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. మే 18వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు వరుసగా ఆరు రోజుల పాటూ రోజూ 50 వేల మందికిపైగా భక్తులు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరీ ముఖ్యంగా మే 23వ తేదీ ఒక్కరోజే 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తలనీలాల సమర్పణకు ఎక్కువ సమయం పట్టకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.ప్రధాన కళ్యాణకట్ట సహా పీఏసీ-1, పీఏసీ-2, పీఏసీ-3, పీఏసీ-5, జీఎన్‌సీ, హెచ్‌వీసీ, సప్తగిరి, నందకం, కౌస్తుభం, శ్రీవేంకటేశ్వర, శ్రీ పద్మావతి విశ్రాంతి గృహాలతో పాటుగా మొత్తం 11 మినీ కళ్యాణకట్టలు భక్తులకు అందుబాటులో ఉంచినట్లు టీటీడీ తెలిపింది. మొత్తం 1152 మంది క్షురకులు, అందులో 269 మంది మహిళా క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నట్లు వెల్లడించింది. ఒక్కొక్కరు తమ 6 గంటల షిఫ్టులో 40 మందికి సేవ చేస్తారని తెలిపింది. మరోవైపు భక్తుల రద్దీకి అనుగుణంగా 250 మంది సిబ్బందికి అదనంగా విధులు కేటాయించినట్లు వెల్లడించింది.మరోవైపు తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులు కళ్యాణకట్టను అత్యంత పవిత్రంగా భావిస్తుంటారని.. అందుకే భక్తులకు ఇబ్బందులు కలగకుండా కళ్యాణకట్టలో పరిశుభ్రతకు పెద్దపీట వేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులకు కేటాయించే బ్లేడ్లు కూడా ముందుగా సోడియం సొల్యూషన్ లో ముంచి, డెటాయిల్‌తో శుభ్రపరుస్తున్నట్లు తెలిపింది. భక్తులు సమర్పించే తలనీలాలను ఎప్పటికప్పుడు సేకరించి భద్రపరుస్తున్నట్లు తెలిపింది. తలనీలాల సమర్పణ తర్వాత చందనం బిళ్లలు కూడా అందిస్తున్నట్లు వివరించింది.

**వైకుంఠం కాంప్లెక్స్ 3** తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 ప్రతిపాదన గతంలోనే వచ్చింది.. కానీ ఈ ప్రతిపాదనను స్థానికులు వ్యతిరేకించడంతో ఆగిపోయింది. తాజాగా మరోసారి ఈ ప్రతిపాదన తెరపైకి రాగా.. టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. కొత్తగా క్యూ కాంప్లె?క్స్ నిర్మించడానికి స్థలాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. తిరుమలలో సుపథం మార్గం దగ్గర కొన్ని ఇళ్లు ఉండేవి.. శ్రీవారి ఆలయాన్ని విస్తరిస్తున్న సమయంలో అక్కడున్న 84 కుటుంబాలను తరలించి ఆర్‌బీ సెంటర్‌లో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అది కూడా 20 ఏళ్ల పాటూ లీజు కింద నామమాత్రపు అద్దెతో కేటాయించా.. ఆ గడువు ముగిసింది. ఆ ఇళ్లపై తమకు శాశ్వత యాజమాన్య హక్కు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. టీటీడీ అధికారుల్ని కలిసి ఈ అంశంపై విన్నవించినా ఒప్పుకోలేదు. కొంతమంది కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు.ప్రస్తుతం టీటీడీ ప్లాన్ చేస్తున్న వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3ని ఇదే స్థలంలో నిర్మించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఈ క్రమంలో ఆర్‌బీ సెంటర్‌లో ఉన్న స్థానికులు వారి సమస్యల్ని, డిమాండ్లను టీటీడీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. టీటీడీ పాలకమండలి సభ్యులు ఈ అంశంపై స్థానికులతో మాట్లాడారు. టీటీడీ ఆలయ ఉన్నతాధికారులతో కూడా స్థానికులు సమావేశమయ్యారు. తమకు తిరుమల బాలాజీనగర్‌లో ఇళ్లు కట్టించి ఇవ్వాలని.. అప్పుడు ఆర్‌బీ సెంటర్‌ను ఖాళీ చేస్తామన్నారు. అయితే టీటీడీ అధికారులు మాత్రం తిరుమల కాదు తిరుపతిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని వారితో చెప్పారు. టీటీడీలో ఉద్యోగాలతో పాటుగా తిరుమలలో షాపులు కేటాయించాలని డిమాండ్ చేయగా.. అధికారులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం అంశంపై టీటీడీ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## పెద్దికి మోడీ ప్రశంసలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల తేదీ దగ్గరపడటంతో ప్రమోషన్ల వేగం పెరిగింది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమా ప్రచారంలో భాగంగా, చిత్ర బృందం మే 28న న్యూఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు సానా, ఇతర ముఖ్య నటీనటులు హాజరయ్యారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఆయన 'పెద్ది' సినిమా కథ గురించి అడిగారని గుర్తుచేసుకున్నారు. గ్రామీణ, గిరిజన కమ్యూనిటీలను క్రీడల ద్వారా ఎలా శక్తివంతం చేయవచ్చనేదే ఈ సినిమా కాన్సెప్ట్ అని తాను వివరించినట్లు తెలిపారు. తన మాటలు విన్న ప్రధాని పశ్చిమ బెంగాల్లోని ఒక మారుమూల గ్రామానికి చెందిన మహమ్మద్ అనే ఫుట్బాలర్ కథను గుర్తుచేశారని చరణ్ చెప్పారు. ఆ ఒక్క ఆటగాడి స్ఫూర్తితో ఆ గ్రామంలో ఇప్పుడు 80 శాతం మంది ఫుట్బాల్ ఆడుతున్నారని మోదీ తనకు వివరించారని తెలిపారు. 'పెద్ది' కూడా అలాంటి మట్టి వాసన ఉన్న, స్ఫూర్తిదాయకమైన కథ అని చరణ్ పేర్కొన్నారు.గ్రామీణ నేపథ్యంతో వచ్చిన తన గత చిత్రాలు ఘన విజయం సాధించాయని, 'పెద్ది' కూడా అదే కోవలో ప్రేక్షకులను అలరిస్తుందని రామ్ చరణ్ ధీమా వ్యక్తం చేశారు. రెండున్నరేళ్ల పాటు చిత్ర బృందం పడిన కష్టం కేవలం వినోదాన్నే కాకుండా స్ఫూర్తిని కూడా పంచుతుందని అన్నారు.

## మితిమీరుతున్న తమ్ముళ్ల గోల

**అనంతపురం,** తెలుగుదేశం పార్టీలో గ్రూపు తగాదాలు ఎక్కువయ్యాయి. నియోజకవర్గంలో నేతల మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. రాష్ట్రంలో అనేక చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తుంది. జిల్లా ఇన్ ఛార్జి మంత్రులు కూడా పూర్తిగా చేతులెత్తేశారు. ఎవరి వైపు ఉంటే ఏం జరుగుతుందోనన్న భయంతో మంత్రులు కూడా మనకెందుకులేనని మౌనంగా ఉంటున్నారు. అయితే రాను రాను ఈ విభేదాలు పార్టీకి ఇబ్బందికరంగా మారుతాయేమోనన్న ఆందోళన పార్టీ క్యాడర్ లో వ్యక్తమవుతుంది. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదంటున్నారు. నియోజకవర్గ స్థాయి నేతల్లో గొడవలు తారా స్థాయికి చేరుకోవడంతో క్యాడర్ కూడా అయోమయంలో పడింది. మహానాడు సందర్భంగా ఈ విభేదాలు మరింత బహిర్గతమయ్యాయి.ఉత్తరాంధ్ర,కోస్తాంధ్ర, రాయలసీమ ఒక చోట కాదు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వ్యతిరేకంగా కన్నబాబు వర్గం అసమ్మతి గళం విప్పింది. తమను పట్టించుకోకుండా వైసీపీ నుంచి వచ్చిన వారికే ప్రయోజనాలు చేకూరుస్తారని, వారికే కార్యక్రమాలకు కూడా ఆహ్వానాలు అందుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇక ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డికి, మాజీ టీడీపీ ఇన్ ఛార్జి ప్రవీణ్ రెడ్డికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. రెండు వర్గాలు ఇటీవల బాహాబాహీకి దిగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యేకు, మాజీ ఎమ్మెల్యేకు మధ్య పొసగడం లేదు. గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నేతలు ఒకరిపై ఒకరు నాయకత్వానికి ఫిర్యాదు చేసుకుంటున్నారు. విశాఖ జిల్లాలో మాజీ మంత్రికి వ్యతిరేకంగా ఒక వర్గం పార్టీ నాయకత్వం ఎదుట పంచాయతీ పెట్టడం కూడా చర్చనీయాంశమైంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉందని పార్టీ కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేశ్ నేరుగా జోక్యం చేసుకుని విభేదాలను పరిష్కరించకపోతే ఈ ప్రభావం లోకల్ బాడీ ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది. అందుకే పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ లు కల్పించుకోవాని పార్టీ అభిమానులు కోరుతున్నారు.

### కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం,

# ముగ్గురు మృతి



**కర్నూలు** ఆదోని మండలం పాండవగల్లు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. పాండవగల్లు నుంచి గనేకల్ గ్రామానికి బైక్పై వెళ్తున్న ఇద్దరు యువకులను, ఆదోని నుంచి కౌతాళం వెళ్తున్న ఆటో ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న మరోవ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## రాయదుర్గంలో ఎకరాకు రూ 237 కోట్లు

రాయదుర్గం భూములు రికార్డ్ బ్రేక్ చేశాయి. రంగారెడ్డి జిల్లా రాయదుర్గంలో టీజీఐఐసీ భూములు వేలం వేశారు. ఎకరం భూమి రికార్డ్ స్థాయిలో 237 కోట్లు పలికింది. దక్షిణ భారత దేశంలోనే అల్ టైమ్ రికార్డ్ ఇది. సర్వే నంబర్ 83/1 లోని 6 ఎకరాల 29 గుంటల భూమికి వేలం నిర్వహించారు. మొత్తం వేలం విలువ రూ.1490 కోట్లు అని అధికారులు తెలిపారు. ఇక గతేడాది ఇదే ప్రాంతంలో ఎకరం భూమి ధర రూ.177 కోట్లు పలికింది.

7.67 ఎకరాల భూమి వేలం వేయగా ఈ రికార్డ్ ధర పలికింది. 7 ఎకరాలకు మొత్తం 1357.59 కోట్లు ఆదాయం ఆర్జించింది టిజిఐఐసి.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గంలో టిజిఐఐసి (తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) భూములు వేలం వేశారు. టిజిఐఐసి నిర్ణయించిన కనీస ధర 139 కోట్ల రూపాయలు కాగా వేలం ముగిసే సమయానికి అది దాదాపు 237 కోట్లకు చేరింది.

# ‘కరికాడ’ మూవీ రివ్యూ!



కన్నడలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ ‘కరికాడ’. నటరాజ్ హీరోగా ఆయన సొంత బ్యానర్లో ఈ సినిమా నిర్మితమైంది. యశ్ శెట్టి కీలకమైన పాత్రను పోషించిన ఈ సినిమాలో,నిరీక్ష శెట్టి కథానాయికగా కనిపిస్తుంది. వెంకటేశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన థియేటర్లకు వచ్చింది. అలాంటి ఈ సినిమా ఈ నెల 29వ తేదీ నుంచి ‘అమెజాన్ ప్రైమ్’ లో స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడతో పాటు తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. అది అడవిని ఆనుకుని ఉన్న ఒక మారుమూల గ్రామం. ఆ గ్రామానికి ఓ మోతుబరి రైతు భూపతి (బల్ రాజ్) ప్రెసిడెంట్ గా ఉంటాడు. అతనికి మల్లి (యశ్ శెట్టి) కాంత (విపిన్ ప్రకాశ్) అనే ఇద్దరు కొడుకులు ఉంటారు. ఇక జార్జ్ అనే యువకుడు కూడా ప్రెసిడెంట్ కి నమ్మకస్తుడిగా ఉంటాడు. ప్రెసిడెంట్ మేనకోడలు ‘కనక’ ( నిరీక్ష) ఆ ఇంట్లోనే పెరుగుతుంది. ఆమె పేరుతో భూమి ఉండటం వలన, తన కొడుకు ‘కాంత’కి ఇచ్చి పెళ్లి చేయాలని భూపతి నిర్ణయించుకుంటాడు. అయితే ఆమె ‘కాడ’ను ఇష్టపడుతూ ఉంటుంది. ‘కాడ’కి వయసు పైబడిన తండ్రి తప్ప మరెవరూ లేరు. అతను తన కష్టాన్ని నమ్ముకుని బ్రతుకుతుంటాడు. అడవి పందులను వేటాడటంలో ఆయనకి మంచి నైపుణ్యం ఉంటుంది. చేనులోకి అడవిపందులు రాకుండా అతను కాపలా కాస్తూ ఉంటాడు. అక్కడ అతనిని ‘కనక’ రహస్యంగా కలుస్తూ ఉంటుంది. అయితే ఆమె కలవారి అమ్మాయి కావడం వలన, కాడ పెద్దగా ఆసక్తిని చూపించడు. ఆమె మనసులో ఏముందనేది భూపతికి అర్థమైపోతుంది.‘కనక’ గనుక ‘కాడ’ను పెళ్లి చేసుకుంటే తన కుటుంబ పరువు ప్రతిష్ఠలు దెబ్బతింటాయి. అంతేకాదు కనక పేరుతో ఉన్న భూమి తన చేజారిపోతుందని భూపతి భావిస్తాడు. అందువలన కాడ అడ్డు తొలగించుకోవాలని భావిస్తాడు. అందుకోసం అతను తన ఇద్దరు కొడుకులను రంగంలోకి దింపుతాడు. ఆ ముగ్గురూ కలిసి ఏం చేస్తారు? వారి కారణంగా ‘కాడ’కి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనేది మిగతా కథ. చరిత్రను ఒకసారి పరిశీలిస్తే భూమికోసం యుద్ధాలు జరిగాయి. భుక్తి కోసం తిరుగుబాట్లు జరిగాయి. అలాగే స్త్రీ కోసం పోరాటాలు జరిగాయి. భూమి కోసం .. స్త్రీ కోసం జరిగే పోరాటమే ఈ సినిమా కథ. ఈ అంశాన్ని ప్రధానంగా చేసుకునే దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. ఒక ప్రెసిడెంట్ .. ఆ ఇంటికి చెందిన ఓ అందమైన అమ్మాయి .. అడవి పందులను వేటాడే ఒక యువకుడు. ఈ ముగ్గురి చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది.అడవి నేపథ్యంలో సాగే కథలో అందమైన ప్రేమకథ కూడా భాగం కావడంతో, ఆడియన్స్ ఈ సినిమా నుంచి లవ్ .. రొమాన్స్ ఆశిస్తారు. హీరోయిన్ వర్షంలో .. రాత్రివేళలో హీరోను కలుసుకునే సన్నివేశాలు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తాయి. కానీ హీరో ఆమె పట్ల తనకి ఎలాంటి ఫీలింగ్స్ లేవని కసురుకుంటూ ఆడియన్స్ ను నిరుత్సాహ పరుస్తూ వెళతాడు.తన మేనకోడలు వేరొకరిపై మనసు పడటం ప్రెసిడెంట్ కి నచ్చదు. అవతల వ్యక్తి ఆమెను ప్రేమించడం ..ప్రేమించకపోవడం అనే విషయాలు ప్రెసిడెంట్ కి అనవసరమైన విషయం. అందువలన హీరో .. హీరోయిన్స్ మధ్య రొమాన్స్ ఉంచవలసింది. అందుకు అవకాశం లేకుండా చేయడం ప్రధానమైన లోపంగానే చెప్పుకోవాలి. ఒక బలమైన ట్రాక్ బలహీనపడినట్టుగా మనకి అనిపిస్తుంది.హీరో అడవి పందులను వేటాడే సన్నివేశాలు .. శత్రువుల బారి నుంచి తప్పించుకునే సన్నివేశాలు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తాయి. ఈ కథను చెప్పడానికి దర్శకుడు ఎంచుకున్న లొకేషన్స్ ఎక్కువ మార్కులు కొట్టేస్తాయని చెప్పాలి. అక్కడక్కడా అనవసరమైన సన్నివేశాలు ఉన్నాయి. అలాగే ఈ సినిమా ఆరంభంలోను .. క్లైమాక్స్ లోను జోడించిన ఒక అంశం ఆడియన్స్ ను అయోమయానికి గురిచేస్తుంది. ఆ విషయాన్ని ఎలా తీసుకోవాలా అనే ఒక విషయం సామాన్య ప్రేక్షకుడికి అర్థం కాదు. ఇక సినిమా చివరిలో ఒక ట్విస్ట్ ఉంటుంది. ఆడియన్స్ గెస్ చేయని ఆ ట్విస్ట్ థ్రిల్ ఫీలయ్యేలా చేస్తుంది. కెమెరా పనితనం .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. ఎడిటింగ్ వైపు నుంచి చూస్తే, ట్రిమ్ చేయవలసిన సన్నివేశాలు కనిపిస్తాయి. యాక్షన్ ను తప్ప మరే అంశాన్ని వాడుకోలేకపోయారు. ప్రధానమైన కథ ఆసక్తికరంగానే ఉన్నప్పటికీ, అదనంగా జోడించిన అంశం అయోమయానికి గురిచేసిందని చెప్పాలి.

## ఐవరీ చీరలో అప్సరసలా జాన్వీ.. ‘పెద్ది’ ప్రమోషన్లలో స్పెషల్ అట్రాక్షన్!



యువ నటి జాన్వీ కపూర్ తన రాబోయే చిత్రం ‘పెద్ది’ ప్రమోషన్లలో భాగంగా తన స్టైలిష్ లుక్స్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా ప్రత్యేకంగా రూపొందించిన ఐవరీ రంగు చీరలో ఆమె అచ్చం దేవకన్యలా కనిపించి ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేశారు.తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను పంచుకుంటూ, “హెలో ఫ్రమ్ యువర్ జాను పాపా” అంటూ సరదా క్యాప్షన్‌ను జోడించారు. సున్నితమైన ఎంబ్రాయిడరీతో, షీర్ ఫ్యాబ్రిక్‌పై డిజైన్ చేసిన ఈ చీరలో ఆమె అప్సరసను తలపించారు. ఈ చీరకట్టులో డ్రామాటిక్ కేప్-స్టైల్ పల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జత చేసిన స్కాల్ప్‌డ్ లేస్ బోర్డర్లు సంప్రదాయానికి ఆధునికతను జోడించాయి. దీనికి మ్యాచింగ్‌గా హెవీ ఎంబ్రాయిడరీతో కూడిన స్వీట్‌హార్ట్ నెక్‌లైన్ బ్లౌజ్‌ను ధరించారు.రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ‘పెద్ది’ చిత్రం తెరకెక్కుతోంది. ఈ యాక్షన్ డ్రామాకు ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్ 4న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్లలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో జాన్వీ తన ఎథ్నిక్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో స్టైల్ చేసిన ఈ లేటెస్ట్ లుక్, ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

## ‘వారణాసి’కి మళ్లీ లీకుల బెడద.. జక్కన్న మౌనం వెనుక అసలు వ్యూహం ఏంటి?




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం ‘వారణాసి’పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ ‘వారణాసి’ విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది.ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి నద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్‌కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈసారి రాజమౌళి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో లీకులపై వెంటనే స్పందించిన ఆయన, ఇప్పుడు మౌనం పాటించడం వెనుక ఏదైనా ప్రత్యేక వ్యూహం ఉందా అనే చర్చ సోషల్ మీడియాలో సాగుతోంది.కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు. ఇక అభిమానులు మాత్రం చిత్రబృందం మరింత అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. ఇటీవల కొన్ని భారీ చిత్రాలకు లీకులు పెద్ద సమస్యగా మారిన నేపథ్యంలో, ‘వారణాసి’ విషయంలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ లీకుల వ్యవహారాన్ని రాజమౌళి ఎలా ఎదుర్కొంటారన్నది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

## ఈ అభిమానం ఇలాగే ఉండాలి



శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్. ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. ‘మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి’ అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

## నేర ప్రపంచంలో ‘సిగ్మా’



తమిళనాడు ముఖ్యమంత్రి, దళపతి విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం ‘సిగ్మా’. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. రాబరీ నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్ ఇది. జూలై 31న చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ధిక్కార స్వభావం కలిగిన ఓ యువకుడు తన తండ్రి చేసిన అప్పులు తీర్చాలనే తపనతో జూదం, దోపిడీలతో కూడిన ఓ నేర సామ్రాజ్యంలోకి అడుగుపెడతాడు. అక్కడ అతను ఎదుర్కొనే ప్రమాదకర పరిస్థితులు, లక్ష్యాన్ని చేరుకోవడానికి అతను చేసే ప్రయత్నాలు ఆద్యంతం ఉత్కంఠను పంచుతాయని, యాక్షన్ మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుందని మేకర్స్ తెలిపారు. ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, సంపత్‌రాజ్, శివ్ పండిట్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్నందిస్తున్నారు. సుభాస్కరన్ నిర్మాత.

# కజిన్స్ అండ్ కల్యాణమ్స్ సిరీస్ రివ్యూ!



ఫ్యామిలీ డ్రామాలకు ఆదరణ అనేది ఎప్పటికీ ఉంటుంది. సహజత్వానికి దగ్గరగా ఉంటూ సరదాగా సాగిపోయే ఈ తరహా కథలకు ఆడియన్స్ వెంటనే కనెక్ట్ అవుతుంటారు. అలాంటి ఒక సిరీస్ ఇప్పుడు మలయాళం నుంచి వచ్చింది. ఈ నెల 29వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఆ సిరీస్ పేరే ‘కజిన్స్ అండ్ కల్యాణమ్స్’. నిజూ సోమన్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ లో మొత్తం 60 ఎపిసోడ్స్ ఉండనున్నాయి. మలయాళంతో పాటు తెలుగు .. తమిళ ..కన్నడ ..హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. ఈ సిరీస్ నుంచి ప్రతి శుక్రవారం 4 ఎపిసోడ్స్ ను వదలనున్నారు. మనూ (కృష్ణ విజయచంద్ర) చందూ (సిద్ధార్థ్) దియా (మనస్విని) అశ్వతి (నైనిత) సంస్కృతి (మాన్య) మేఘ (నందిత) వీళ్లంతా కజిన్స్. కేరళకు చెందిన ఈ కుటుంబాలన్నీ కూడా ఎక్కడెక్కడో నివసిస్తూ ఉంటాయి. అందువలన బంధువుల ఇళ్లలో జరిగే ఫంక్షన్స్ లో తప్పకుండా కలుసుకుంటూ ఉంటారు. అందువలన పిల్లలందరి మధ్య చిన్నప్పటి నుంచి మంచి సాన్నిహిత్యం ఉంటుంది. ఎప్పటికప్పుడు వాళ్లు గతంలో తాము కలిసినప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉంటారు. కజిన్స్ బ్యాచ్ అంతా కూడా యవ్వనంలోకి అడుగుపెడతారు. అలాంటి పరిస్థితులలోనే ‘మనూ’కి ‘వీణ’ అనే అమ్మాయితో పెళ్లి ఖాయమవుతుంది. పెళ్లికి సంబంధించిన పనులన్నీ చకచకా జరిగిపోతూ ఉంటాయి. ఆ పెళ్లికి అతని కజిన్స్ అంతా హాజరవుతారు. ‘మనూ’ .. దియా మధ్య చిన్నప్పటి నుంచి ఒక రకమైన ఆకర్షణ ఉంటుంది. వయసుకు వచ్చాక అది ప్రేమగా మారుతుంది. ఆ విషయం మిగతా కజిన్స్ కి కూడా తెలుసు. అయినా అనుకోని కారణాల వలన, వీణతో మనూకి పెళ్లి కుదురుతుంది. మనూ పెళ్లికి ముందురోజు రాత్రి అతణ్ణి రహస్యంగా కలుస్తుంది దియా. ఆ రాత్రే తాము ఊరొదిలి పారిపోవాలని అంటుంది. అందుకు అతను కూడా అంగీకరిస్తాడు. వాళ్లిద్దరూ ‘త్రిశూల్’ వెళ్లి అక్కడ పెళ్లి చేసుకోవడానికి కజిన్స్ ప్లాన్ చేస్తారు. ఆ ప్లాన్ ప్రకారం వెళ్లిపోయిన ఆ ఇద్దరిలో, మనూ తిరిగి రావడం కజిన్స్ ను షాక్ కి గురిచేస్తుంది. మనూ ఎందుకు వెళ్లలేదు? దియా ఏమైపోయింది? పెళ్లి ఆమెది వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేసింది? అనేది కథ. సాధారణంగా ఫంక్షన్స్ కి వెళ్లడానికి పిల్లలు ఎక్కువగా ఆసక్తిని చూపుతుంటారు. ఆ వేడుకలలో అయినవాళ్లతో మరింత సన్నిహితంగా మసలుకుంటూ ఉంటారు. ఆటపాటలతో కూడిన ఆ పరిచయాన్ని వాళ్లు అంత తేలికగా మరిచిపోలేరు. అలా ఒక్కో ఫంక్షన్ కి వెళ్లినప్పుడల్లా వాళ్ల మధ్య సాన్నిహిత్యం పెరుగుతూ వెళుతుంది. వయసుతో పాటు అది ప్రేమగా మారుతుంది. అలాంటి కజిన్స్ చుట్టూ అల్లుకొన్న కథ ఇది. దర్శకుడు ఈ కథను అల్లుకున్న తీరు బాగుంది. ఆరుగురు కజిన్స్ 7 పెళ్లిళ్లలో కలుసుకుంటారు. ఒక్కో పెళ్లి వేడుక వాళ్ల జీవితంలో ఒక మలుపుకు కారణమవుతుంది .. ఒక అందమైన జ్ఞాపకంగా మారిపోతుంది. పెళ్లి నేపథ్యంలో సందడిగా నడిచే సన్నివేశాలను డిజైన్ చేసుకున్న విధానం సరదాగా అనిపిస్తుంది. అలకలు .. అల్లరి పనులు .. సరదాలు .. గొడవలు ఆడియన్స్ ను వెంటనే కనెక్ట్ అయ్యేలా చేస్తాయి. ఇక కజిన్స్ అందరూ ఒక్కో ప్రదేశంలో పెరుగుతారు. అక్కడ వాళ్లు పెరిగిన తీరు .. అక్కడి లైఫ్ స్టైల్ .. వాళ్ల స్వభావాల మధ్య తేడా ఇవన్నీ కూడా దర్శకుడు ఆవిష్కరించిన పద్ధతి సహజత్వానికి చాలా దగ్గరగా అనిపిస్తుంది. ముఖ్యంగా పల్లెటూరి పిల్ల దియా .. పట్నం పిల్లాడు మనూ మధ్య చోటుచేసుకునే సన్నివేశాలు ప్రేక్షకులను తమతో పాటు పరిగెత్తిస్తాయి. లవ్ .. కామెడీ .. ఫ్యామిలీ ఎమోషన్స్ కు కనెక్ట్ చేస్తాయి. ఏడు పెళ్లి వేడుకలకి ఆరుగురు కజిన్స్ తమ పేరెంట్స్ తో కలిసి హాజరవుతారు.. ఆ ఏడు పెళ్లిళ్లు ఈ ఆరుగురు జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయనేది కథ. పెళ్లి వేడుకలలో ప్రేమ ప్రయాణం అనేట్టుగా సాగే ఈ సిరీస్ నుంచి ప్రస్తుతం 4 ఎపిసోడ్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దర్శకుడు ఈ సిరీస్ ను మొదలుపెట్టిన విధానం చూస్తేనే, స్క్రీన్ ప్లే బలంగానే ఉందనే విషయం అర్థమవుతోంది.

ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా బాగా చేశారు.

ప్రవీణ్ బాలకృష్ణన్ అందించిన ఈ కథకు, ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ న్యాయం చేశాయని అనిపిస్తుంది. నిర్మాణ విలువలతో పాటు, కథాకథనాలు .. కథకి తగిన లొకేషన్స్ ఈ సిరీస్ కి ప్రధానమైన ఆకర్షణ అనే చెప్పాలి. మొదటి నాలుగు ఎపిసోడ్స్ లోనే చాలా కథను చెప్పేశారు. అందువలన ఈ సిరీస్ కథనం వేగంగా ఉండేలానే కనిపిస్తోంది. మిగతా 56 ఎపిసోడ్స్ లో కొత్త పాత్రలు .. ఆసక్తికరమైన మలుపులు పలకరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఫ్యామిలీ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యే కంటెంట్ గానే చెప్పుకోవలసి ఉంటుంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com